

చోరీ కేసులో సినీనటి సౌమ్యశెట్టి అరెస్టు

- స్నేహితురాలి ఇంట్లోకి వెళ్లి బంగారం చోరీ
- 57 తులాలు రికవరీ చేసిన పోలీసులు

- వార్త మెయిన్ 3లో..



కదంతొక్కిన ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహా పాదయాత్ర

కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నినాదాలతో హోరెత్తించిన కార్మికులు

సంఘీభావంగా పాదయాత్రలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నేతలు



మహా పాదయాత్రలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, ఉక్కు ఉద్యోగులు, వివిధ పార్టీల నేతలు

కూర్మన్నపాలెం, మార్చి 3:

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు కార్మికులు ఆదివారం నగరంలో కదం తొక్కారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో మహా పాదయాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వడ్లపూడి, శ్రీనగర్, చినగంట్యాడ, గాజువాక, ఆటోనగర్, షీలానగర్ మీదుగా జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వరకు సాగింది. మహా పాదయాత్రలో మహిళలు, విద్యార్థి, దళిత, ప్రజా, నిర్వాసిత, ఉద్యోగ సంఘాలు, వామపక్ష, టీడీపీ, వైసీపీ, జనసేన, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు.

ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన పాదయాత్రలో కార్మిక సంఘాల నాయకులతో పాటు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ... మిగతా 6వ పేజీలో



సంఘీభావం తెలుపుతున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, ఉక్కు ఉద్యోగులు, నాయకులు

ఉద్యమంపై ఎందుకంత ప్రేమ?

- మహా పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపిన మేయర్
- మూడేళ్లుగా నిరసనలకు దూరంగా హరివెంకటకుమారి
- గాజువాక వైసీపీ టికెట్ కోసమేనని ప్రచారం



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంపై హఠాత్తుగా ఎందుకు ప్రేమ పుట్టుకొచ్చిందనే దానిపై నగరంలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత మూడుళ్లుగా కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు ఉద్యమిస్తున్నాయి. పలుమార్లు టీడీపీ, జనసేన నేతలు కార్మిక సంఘాల నేతలు చేపట్టిన దీక్షా శిబిరాలకు వెళ్లి ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. మేయర్‌గా గొలగాని హరివెంకటకుమారి ఎన్నికై దాదాపు మూడేళ్లు పూర్తవుతోంది. ఈ మధ్యకాలంలో ఆమె ఒక్కసారి కూడా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన సందర్భం లేదు. కార్మిక సంఘాల దీక్షా శిబిరానికి వెళ్లి సంఘీభావం ప్రకటించిన దాఖలాల్లేవు. మధ్యలో ఒకసారి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కౌన్సిల్ తీర్మానం చేసిన సందర్భంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మిక సంఘాల దీక్షా శిబిరం సమీపంలోకి వెళ్లినా కార్మికులను కలవకుండానే వెనుదిరిగారు.

షడన్ ప్రేమకు కారణమేమిటో?

అకస్మాత్తుగా మేయర్‌కు స్టీల్‌ప్లాంట్ ఉద్యమంపై అమిత ప్రేమ పుట్టుకొచ్చింది. గత 15 రోజులుగా తరచూ గాజువాక నియోజకవర్గంలో ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటున్న ఆమె ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కూడా అక్కడే ప్రారంభించారు. అక్కడితో ఆగకుండా కార్మిక సంఘాలు, ... మిగతా 6వ పేజీలో

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం?

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
- ఉమ్మడి జిల్లాలో 342 కేంద్రాల గుర్తింపు
- నేటి నుంచి ఎన్‌సీఈఆర్‌టీ బృందం పర్యటన
- వసతులు, ఇతర అంశాలపై పరిశీలన



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):

కేంద్రం రూపొందించిన నూతన విద్యా విధానం అమల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల విలీనం కోసం విస్తృత స్థాయి కసరత్తు జరుగుతోంది. ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలున్న వాటిని ముందుగా గుర్తించి విలీనం చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం సమీపంలోని కేంద్రాలను కూడా విలీనం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 342 చోట్ల ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ముందుగా వీటన్నింటినీ విలీనం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇది ముగిసిన తరువాత దగ్గరగా ఉన్న వాటిని విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. నూతన విద్యావిధానంలో భాగంగా రెండేళ్ల క్రితమే ఉన్నత పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేశారు. దీంతో ఆయా ఉన్నత పాఠశాలల్లో మూడు నుంచి పది వరకు తరగతుల బోధన జరుగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా రేషనలైజేషన్ చేసి ప్రాథమిక పాఠశాలల్లో మిగులు టీచర్లను ఉన్నత పాఠశాలకు పంపారు. ప్రస్తుతం మూడు నుంచి ఐదు తరగతులకు సబ్జెక్టు టీచర్లు బోధిస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి ఐదు తరగతుల విలీనం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. ఈ విలీనంపై సర్వత్రా వ్యతిరేకత వెల్లువెత్తినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొండిగా వ్యవహరించిందన్న ఆరోపణలున్నాయి.

పునాది పాఠశాలలుగా మార్పు

ఇదిలావుండగా రానున్న విద్యా సంవత్సరం నుంచి ఒకే ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయనున్నారు. వీటిని పునాది పాఠశాలలు (ఫౌండేషన్ స్కూళ్లు) అని పిలుస్తారు. మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వయసు మధ్య ఉండే బాల బాలికలు ఈ పాఠశాలల్లో చదువుతారు. ప్రీకేజీ నుంచి రెండో తరగతి వరకు విద్యార్థులకు అందించే బోధనను పూర్వ ప్రాథమిక విద్యగా వ్యవహరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల విలీనం నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో వసతులు ఉన్నాయా? భద్రతా ప్రమాణాలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం వివరాలు కోరుతోంది. ఈ మేరకు నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ స్టేజ్ 1లో భాగంగా పునాది స్కూళ్లు ప్రారంభించే క్రమంలో ... మిగతా 6వ పేజీలో

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

- సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో కట్టడి
- ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ
- సీపీ రవిశంకర్ అయ్యనార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్‌అయ్యనార్, జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో సైబర్ నేరాలకు అడ్డుకట్టవేసేందుకు సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారం తీసుకుంటామని పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ తెలిపారు. కమిషనరేట్ ఆవరణలోని సమావేశమందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఇతర నేరాలతో పోల్చితే సైబర్ నేరాల కారణంగా ప్రజలు భారీగా నష్టపోతున్నారన్నారు. సైబర్‌క్రైమ్‌లో నేరగాళ్లు కొల్లగొడుతున్న మొత్తం ప్రతి ఏటా పెరుగుతోందని, దీనికి అడ్డుకట్ట వేసేందుకు సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్‌లోని సభ్యులు, సంస్థలతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామన్నారు.

సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు వీలుగా విశాఖ పోర్ట్ ట్రస్ట్ సీఎస్‌ఆర్ కింద రూ.కోటి అందజేసేందుకు ముందుకొచ్చిందన్నారు. ఈ మొత్తంతో సైబర్‌ల్యాబ్‌లో టూల్స్‌ని అప్‌గ్రేడ్ చేసి కేసుల దర్యాప్తుని సులభతరం చేసేందుకు కృషిచేస్తామన్నారు. నగరంలో నేరాలతోపాటు చోరీలను తగ్గించేందుకు వీలుగా ఎక్కడికక్కడ సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతోపాటు ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాల సామర్థ్యాన్ని పెంపొందిస్తామన్నారు. ఎన్నికల నేపథ్యంలో నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు ప్లటూన్ల సీఐఎస్ఎఫ్ బృందాలు నగరానికి చేరుకున్నాయన్నారు.

భూ కబ్జాలపై ఉక్కుపాదం

నగరంలో భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపేందుకు వీలుగా అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించామన్నారు. కబ్జాలకు పాల్పడేవారు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించేవారిపై నిఘా పెట్టామన్నారు. భూ కబ్జాలపై ఫిర్యాదుల కోసమే ప్రత్యేకంగా డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులు, ఒంటరిగా నివసించేవారు, విదేశాల్లో ఉండేవారి ఆస్తులను లక్ష్యగా చేసుకుని కబ్జాలకు పాల్పడుతున్నట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఇలాంటి నేరాలపై ఫిర్యాదు రాగానే సంబంధిత ... మిగతా 6వ పేజీలో

ఫుడ్‌కోర్ట్ తొలగింపుపై మీనమేషాలు

పది నెలల కిందటే జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేసినా స్పందన శూన్యం

- మేయర్ ఆదేశాలనూ పట్టించుకోని అధికారులు
- వైసీపీ నేతలే అడ్డుపడుతున్నారంటున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది
- రోజువారీ మామూళ్లు దండుకుంటున్నారని ప్రతిపక్షాల విమర్శలు
- పాత జైలురోడ్డులో అనధికారికంగా కొనసాగుతున్న ఫుడ్‌కోర్ట్

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

'పాతజైలురోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్ట్‌పై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు వ్యర్థాల కారణంగా తీవ్ర దుర్వాసన వెలువడుతోందని చుట్టుపక్కల నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. ఫుడ్‌కోర్ట్ వెనుకవైపు కొంతమంది బహిరంగంగానే గంజాయి సేవిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో ఫుడ్‌కోర్ట్‌ను మరో చోట ఏర్పాటుచేయాలని జీవీఎంసీ కౌన్సిల్ నిర్ణయించింది'

గత ఏడాది మేలో జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి ప్రకటన.



పదినెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఫుడ్‌కోర్ట్ తొలగింపు జరగలేదు. దీనిపై పాలకవర్గంలోని కొంతమంది పెద్దలతోపాటు స్థానిక వైసీపీ నేతకు భారీగా డబ్బులు ముడుతుండడంతో అడ్డుపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో అర్ధరాత్రి సమయంలోనూ పర్యాటకులు, సందర్శకులు, నగరవాసులకు ఆహారం అందుబాటులోకి ఉంచేందుకు వీలుగా పాతజైలురోడ్డులో నైట్ ఫుడ్‌కోర్ట్‌ను ఏర్పాటుచేశారు. కరోనా నేపథ్యంలో దీనిని మూసివేయగా ఆ తర్వాత తెరిచేందుకు జీవీఎంసీ అనుమతి ఇవ్వలేదు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు, పాలకవర్గంలోని కొంతమంది పెద్దల అండతో కొంతమంది వ్యాపారులు పాతజైలు రోడ్డులో అనధికారికంగా దుకాణాలను ఏర్పాటుచేశారు. ఇక్కడ 32 దుకాణాలతో పునఃప్రారంభమైన ఫుడ్‌కోర్ట్‌లో తాజాగా 150కిపైగా దుకాణాలున్నాయి. అక్కడి నుంచి ఫుడ్‌కోర్ట్‌ను నుంచి తొలగించాలంటూ స్థానిక కార్పొరేటర్‌తోపాటు నివాసితులు ఫిర్యాదు చేయడంతో అధికారులు అనుమతి ఇవ్వలేదు. అయినప్పటికీ అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో జీవీఎంసీకి ఆదాయం సమకూరడం లేదు. పైగా ఫుడ్‌కోర్ట్ కారణంగా అనేక ఇబ్బందులు తలెత్తుతున్నందున తక్షణం తొలగించాలంటూ స్థానికులు తరచూ ఫిర్యాదు చేస్తున్నారు.

కౌన్సిల్‌లో ప్రస్తావించిన కార్పొరేటర్

గత ఏడాది మేలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఫుడ్‌కోర్ట్ కారణంగా జీవీఎంసీకి పైసా ఆదాయం రావడం లేదని, పాలకవర్గంలోని కొందరు పెద్దలు, అధికారులు భారీగా డబ్బులు దండుకుంటున్నారంటూ ప్రతిపక్ష కార్పొరేటర్లతోపాటు అధికారపార్టీకి చెందిన కార్పొరేటర్లు కూడా తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. తక్షణం ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని పట్టుబట్టడంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి తొలగించేందుకు ప్రతిపాదన చేశారు. దీనికి కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు. వారం రోజుల్లో ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని జీవీఎంసీ అధికారులను మేయర్ ఆదేశించారు.

నెలలు గడిచినా చర్యల్లేవ్...

తర్వాత ఏం జరిగిందోగానీ.... ఇంతవరకూ ఫుడ్‌కోర్ట్‌ను తొలగించలేదు. కౌన్సిల్‌లో తీర్మానం చేసిన తరువాత కూడా దుకాణాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీనిపై జనసేన, టీడీపీ కార్పొరేటర్లు కలిసి విలేకరుల సమావేశం పెట్టి ఫుడ్‌కోర్ట్ తొలగింపును మేయర్ స్వయంగా ఆదేశించినా, ఎందుకు అమలుచేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్‌లో చేసిన తీర్మానాన్ని అమలుచేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పాలకవర్గంలోని కొంతమంది పెద్దలకు ఫుడ్‌కోర్ట్‌లోని దుకాణాల నుంచి మామూళ్లు అందుతుండడమే కారణమని ఆరోపించారు.

అధికార పార్టీ అండతోనే...

వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే, పాలకవర్గంలోని కొంతమంది పెద్దల అండతోనే ఫుడ్‌కోర్ట్ నడుస్తోందనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ఆ దుకాణాల జోలికి వెళ్లొద్దని టౌన్‌ప్లానింగ్ అధికారులను వారు ఆదేశించినట్టు సమాచారం. పాలకవర్గంలోని కొందరు పెద్దలకు ఎమ్మెల్యే మద్దతు తెలపడం కలిసొచ్చింది. ఎమ్మెల్యే ఆదేశాలనే ధిక్కరిస్తారా? పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళతామంటూ బెదిరింపులకు దిగుతున్నారని టౌన్‌ప్లానింగ్ అధికారులు వాపోతున్నారు. ఫుడ్‌కోర్ట్ ... మిగతా 6వ పేజీలో

సీఎం జగన్ రాక రేపు



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల ఐదో తేదీన నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 9.40 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45కు రుషికొండలోని ఐటీ హిల్ నంబరు-3లో ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు విజన్ వైజాగ్ లోగో ఆవిష్కరణ, పారిశ్రామికవేత్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో పీఎం పాలెంలోని వి కన్వెన్షన్ హాల్‌కు 12.45 గంటలకు చేరుకుని, 'కేస్కేడింగ్ స్కిల్స్-పేరిడియం భగవత' సదస్సును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.50 గంటలకు తిరిగి రుషికొండ హిల్ నంబరు-3కి చేరుకుని హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుతారు. 2.30 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరి వెళతారు.

పల్స్ పోలియోకు విశేష స్పందన



స్వర్ణభారతి సమీప అర్బన్ హెల్త్ సెంటర్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రాత్రి ఏడు గంటల సమయానికి 97.12 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 2,08,163 మంది చిన్నారులకు పోలియోచుక్కలు వేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా, 97.12 శాతంతో 2,02,178 మంది చిన్నారులకు అందించారు. మిగిలిన చిన్నారులకు నాలుగు, ఐదు, ఆరు తేదీల్లో అందించేలా ఏర్పాట్లు చేశారు. స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పల్స్ పోలియో విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ప్రోగ్రామ్ అధికారులు, డెమో బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029



కంటైనర్‌తో పోలీసుల పైకి..

- గంజాయి ముఠా బరితెగింపు

- వివరాలు మెయిన్ 3లో

విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు

- బక్కన్నపాలెం ఫొటోగ్రాఫర్ సాయి మృతదేహం లభ్యం
- గోదావరి ఇసుక తిన్నెల్లో వెలికితీత
- నిందితుడిది కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం

- వార్త 7వ పేజీలో



మృతుడు సాయి పవన్ (ఫైల్)

'ఐడియల్ గాంధర్వ' గాయకుల ఎంపిక



ఘంటసాల చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గాయకులు, ప్రముఖులు

డాబాగార్డెన్స్, మార్చి 3: ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకులు డాక్టర్ టి.శరత్‌చంద్ర సారథ్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడియల్ గాంధర్వ పేరిట గాయనీగాయకుల ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ ఛైర్మన్ వంకాయల సన్యాసిరాజు, ఎన్ఆర్ఐలు జి.రాము కే.సుధారాణి జ్యోతి ప్రజల్వనగావించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని 10 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వరకు గాయనీగాయకులు పాల్గొని పాటలు పాటారు. ప్రతిభ ఆధారంగా కొందరిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. త్వరలో ఘంటసాల గాన మాధుర్యాన్ని కీర్తిస్తూ 140 ఎపిసోడ్‌లతో ప్రేక్షకుల చెంతకు ఈ కార్యక్రమం చేరుతుందన్నారు.కార్యక్రమంలో వి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యశర్మ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, జె.పృథ్వీరాజ్, మెలోడి సత్యనారాయణ, కందర్పరాధ, పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడియల్ గాంధర్వ లోగోను సినీ నటులు సుమన్ ఆవిష్కరిస్తారని, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి ప్రదర్శన ఉంటుందన్నారు.

'విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి చేయూతనివ్వాలి'



మాట్లాడుతున్న బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరసింహ ఆచారి

మహారాణిపేట/ జగదాంబ, మార్చి 3: విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి రూ.500 కోట్లు మూలధనం ఏర్పాటు చేయాలని టీడీపీ విశ్వబ్రాహ్మణ సంఘం బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గోడి నరసింహ ఆచారి డిమాండ్ చేశారు. ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు వండ్రంగి, స్వర్ణకారులు, కంచరపని, కమ్మరి, శిల్పి తదితర చేతివృత్తులపై ఆధారపడిన ఎంతోమంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారన్నారు. నగరంలో 15 లక్షల మంది జనాభా నివసిస్తున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలో విశ్వబ్రాహ్మణుల కోసం రూ. 50 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అలాగే, విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబును కలసి సమస్యలు వివరిస్తామన్నారు. అలాగే, టౌన్ హాల్ వద్ద విశ్వ బ్రాహ్మణులు నిరసన తెలిపారు. ఈసమావేశంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

'రాజ్యాంగంపై వ్యతిరేకత తగదు'

సీతంపేట, మార్చి 3: భారత రాజ్యాంగంపై వ్యతిరేకత తగదని ప్రముఖ రచయిత గుంటూరు లక్ష్మీ నరసయ్య పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో భీమ్ సేన వార్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీ నరసయ్య 'భారత రాజ్యాంగం అవగాహన, ఉద్దేశపూర్వక వక్రీకరణలు' అనే అంశంపై మాట్లాడారు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే కుల నిర్మూలన పోరాటాలను వ్యతిరేకించినట్టేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన ఏయూ ప్రొఫెసర్ సత్యపాల్ విజయవాడలో అంబేడ్కర్ ఫొటో గ్యాలరీ, ప్రత్యేకతలు అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ వేమన, డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, మధుకుంచే, వై.బాలకృష్ణ, ఓంకార్ ప్రసాద్, గుడివాడ అప్పారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో త్వరలో భారత్ అత్యున్నత స్థానం



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

మహారాణిపేట, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హయాంలో స్థాపించిన టెక్ విజన్ సాఫ్ట్‌వేర్ సంస్థ మరో ఐదేళ్లలో లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందని తెలుగుదేశం పార్టీ యువనేత ఆడారి కిశోర్ కుమార్ అన్నారు. ఆదివారం బీచ్ రోడ్డులోని పార్కు హోటల్‌లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టెక్ విజన్ సంస్థ ప్రతిభా అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆడారి కిశోర్ మాట్లాడుతూ పదివేల మంది ఉద్యోగులు ఉన్న తమ సంస్థ మరింత ఉన్నతి సాధించనున్నదని, దేశ విదేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు.సంస్థ డైరెక్టర్ హేమంత్ మాట్లాడుతూ విశాఖలో కంపెనీల సంస్కృతి పెరుగుతుందని, మరికొన్నాళ్లలో అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరచిన ఉద్యోగులకు బహుమతులు అందించారు ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను దగా చేస్తున్న వైసీపీ ప్రభుత్వం'



టీడీపీ బీసీ సెల్ నేత వెంకటేశ్వరరావు

అక్కయ్యపాలెం, మార్చి 3 : వైసీపీ ప్రభుత్వం బీసీలను దగా చేస్తోందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్వరరావు మండిపడ్డారు. స్థానికకార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఆ యన మాట్లాడారు. రాజకీయంగా, ప్రభుత్వ పరంగా, ఉద్యోగుల విషయంలో బీసీలను తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఒక్క రెడ్డి సామాజిక వర్గానికి మాత్రమే ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో మూడు స్థానాల్లో రెండు రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏయూ వీసీగా రెండో సారి కూడా ఆ సామాజిక వర్గానికే కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ ఛైర్మన్ పదవి కూడా గత నాలుగేళ్లుగా రెడ్డి వర్గానికే ఇచ్చారన్నారు. చూస్తే వైసీపీ బీసీలకు ఎంత అన్యాయం చేస్తుందో అర్థమవుతుందన్నారు. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ త్రినాథ్, విశాఖ పార్లమెంటరీ తూర్పు కాపు అధ్యక్షుడు దొడ్ల వెంకట జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14162

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైభవంగా బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవం



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు, అతిథులు



గురువుకు నమస్కరిస్తున్న సినీ నటుడు శుభలేఖ సుధాకర్

సీతమ్మధార, మార్చి 3: నగరంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ఫౌండర్ ప్రెసిడెంట్ కె.జయభారత్ రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధు కుమార్, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోల్డెన్ జూబ్లీ హాల్‌నుప్రారంభించారు. ఈసందర్భంగా ఎ. జయభరత్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల 50 ఏళ్ల వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అర్థ శతాబ్దిలో కళాశాల ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఎందరికో ఉపాధి అవకాశాలు దక్కించుకునే లా యాజమాన్యం కృషి చేసినట్టు వివరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మరో ఏభై ఏళ్లు ఇలానే ఉన్నత విద్య అవకాశాలు తమ విద్యార్థులు అందుకునేలా అధ్యాపక బృందం కృషి చేయాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ మధుకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధి అవకాశాల దృష్ట్యా ఆధునిక పరిజ్ఞానంతోపాటు పారిశ్రామిక నైపుణ్య శిక్షణను అందించే ప్రయత్నంలో భాగంగా కొన్ని కంపెనీలతోతమ కళాశాల భాగస్వామ్యం కలిగి ఉన్నట్టు తెలిపారు. కళాశాల విద్యార్థులకు చదువుతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందన్నారు.

పూర్వ విద్యార్థులుగా ప్రముఖులు

అనంతరంసమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, కళాశాల పూర్వ విద్యార్థి ధర్మాన కృష్ణదాసుమాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాల్లో పాల్గొనడం ఎంతగానో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థి సమయంలో కళాశాలలో గడిపిన క్షణాలు గుర్తుకువస్తున్నాయన్నారు.

కళాశాల ద్వారా ఎంతో మంది ఉన్నత శిఖరాలను ఆధిరోహించారని తెలిపారు. కళాశాల తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం జరిగింది. వారు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థి సినీ నటుడు శుభలేఖ సుధాకర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇతర విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీకి మరో అవకాశమిస్తే శ్రీహరికోటనూ తాకట్టు పెట్టేస్తారేమో?

▸▸ సచివాలయం తాకట్టుపై మాజీ మంత్రి గంటా ధ్వజం

అక్కయ్యపాలెం, మార్చి 3 : 'నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ భవనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాకట్టు పెట్టారని, ఇప్పుడు ఏకంగా రాష్ట్ర సచివాలయంపై బ్యాంక్‌కు గ్యారెంటీ చూపి రుణాన్ని వాడుకోవడం దారుణమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో వివరించారు. అప్పుల ఊబిలో మునిగిపోయిన శ్రీలంక కూడా తమ పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టలేదని, కానీ జగనన్నకు సాధ్యమని మరోసారి నిరూపించారని చెప్పారు. మళ్లీ ఇంకో అవకాశం ఇస్తే శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం, సాగర్‌డ్యామ్, శ్రీశైలం డ్యామ్, పోలవరం ఆనకట్టలను కూడా తాకట్టు పెట్టేస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపి, రాష్ట్రా కి ఒక్కరాజధాని కూడా లేకుండా చేసి చివరికి ఉన్న సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారన్నారు. విశాఖలో 13 ప్రభుత్వ ఆస్తులు, భవనాలు, కాలేజీలు తాకట్టు పెట్టి రూ.25వేల కోట్లు, మద్యంపై రూ.48వేల కోట్లు అప్పు తీసుకొచ్చారని తెలిపారు. ఆర్అండ్‌బీ ఆస్తులు తాకట్టు పెట్టి రూ. 7వేల కోట్లు అప్పు చేశారని, కానీ రోడ్లు వేయలేదన్నారు. టిడ్కో ఇళ్లు తా కట్టు పెట్టి రూ.10వేల కోట్ల అప్పు తీసుకొచ్చారని, ఇళ్ల నిర్మాణాలను పూ ర్తి చేయలేదన్నారు. చెత్తతో సహా రకరకాల పన్నులతో రూ.లక్షల కోట్లు ప్రజలపై భారం మోపుతున్నారన్నారు.

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యమివ్వాలి

▸▸ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్



సంఘీభావాన్ని ప్రకటిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, మార్చి 2: త్వరలో జరగనున్న ఎన్నికల్లో జనాభాలో 50 శాతంపైగా ఉన్న బీసీలకు రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తగిన రీతిలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల టీడీపీ, జనసేన కూటమి ప్రకటించిన తొలి జాబితాలో బీసీలకు కేవలం 21 మందికి టికెట్లు ప్రకటించిందని, ఈ సంఖ్యను మరో 50 శాతానికి పెంచాలన్నారు. సమస్యలపై ఈ నెల రెండో వారంలో గుంటూరులో బీసీ ప్రతినిధులతో రాజకీయ ప్లీనరీ నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల కుమ్మర క్రాంతికుమార్, ఎం.రమణ, శ్రీనివాసరావు, ద్వారకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీలోనే ప్రభుత్వ ఉద్యోగులకు అధిక జీతాలు

▸▸ ముఖ్యమంత్రి సలహాదారు అజేయ్‌కల్లాం

మహారాణిపేట, మార్చి 3: దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకే అత్యధిక జీతాలు చెల్లిస్తున్నామని ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రి సలహాదారు అజేయ్‌కల్లాం అన్నారు. విశాఖలోని ఓ హోటల్‌లో ఆదివారం ట్రాన్స్ ఫార్మింగ్ గవర్నన్స్ పేరుతో నిర్వ హించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే 30 శాతం అధికమన్నారు. ఉద్యోగుల జీతాల చెల్లింపునకే అత్యధికంగా నిధులు ఖర్చుచేయాల్సి వస్తోందన్నారు. గుజరాత్‌లో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు రూ.15 వేల కోట్లు చెల్లిస్తుండగా, ఏపీలో రూ.53 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అభివృద్ధి అంటే రోడ్లు వేయడం, కాంక్రీట్ నిర్మాణాలుకాదన్నారు. మానవ వనరులను అభివృద్ధి చేయడమేనన్నారు. ఇందులో భాగంగా అవసరం లేకున్నా ప్రతి గ్రామానికీ కనీసం పది ఉద్యోగాలను కల్పించాలని సచివాలయ వ్యవస్థ ద్వారా 2.4 లక్షల మందికి ఉద్యోగాలనుఇవ్వాల్సి వచ్చిందని వివరించారు. ప్రొ ఫెసర్ ప్రసన్న కుమార్, వి.బాల మోహనదాస్, కార్తీక్, సుధాకర్ పాల్గొన్నారు.

'మహాప్రస్థానం' జీవితాన్ని మార్చింది..

▸▸ సినీ గీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ



అశోక్ తేజ దంపతులను సన్మానిస్తున్న రసజ్ఞ వేదిక ప్రతినిధులు

సీతంపేట, మార్చి 3: నాలుగు ఏళ్ల వయసులో నా తండ్రి శ్రీశ్రీ రాసిన మహా ప్రస్థానం గీతాలను చదివించడం ద్వారా ఈ రోజు మీ ముందు ఇలా నిల్చోగలుగుతున్నట్టు సినీ గీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన 40 ఏళ్ల ప్రజా గీతాల పరివ్రాజకుడు, 30 ఏళ్ల సినీ గీతాల ప్రయాణికుడు, భాషారత్న డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట-పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ తేజ మాట్లాడుతూ, విశాఖ తనకు ఎంతో ఇష్టమైన నగరమని, తన భవిష్యత్తు పునాది ఈ నగరంలోనే జరిగిందన్నారు. 1989లో బతుకు పాటలు రాసిన తర్వాత సినిమాల్లోకి అవకాశాలు వచ్చాయని తెలిపారు. రచనా వ్యాసంగాన్ని జీవితం చివరి వరకు కొనసాగిస్తానన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కిరణ్ ప్రభ కౌముది (యూఎస్ఏ) మాట్లాడుతూ సుద్దాల అశోక్ తేజ గొప్ప రచయిత, గాయకుడని అన్నారు. ఎన్నో వేల పాటలతో జనాలను రంజింప చేశారన్నారు. ఈసందర్భంగా సుద్దాల అశోక్ తేజ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రయోగ సుబ్రహ్మణ్యం, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ నరసింగరావు, పలువురు రచయితలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సముద్ర లక్ష్మణ విన్యాసాలు

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భారత్, మలేషియా ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా గత నెల 28 నుంచి ఈ నెల రెండో తేదీ రాత్రి వరకు సాగిన సముద్ర లక్ష్మణ విన్యాసాలు ముగిశాయి. ఈ విన్యాసాల్లో భాగంగా భారత్ నావికా దళానికి చెందిన కిల్తాన్, రాయల్ మలేషియాకు చెందిన కేడీ లెకిర్ పాల్గొన్నాయి. ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా హార్బర్, సీ ఫేజ్‌లో ఈ విన్యాసాలను నిర్వహిం చారు. హార్బర్ ఫేజ్‌లో భాగంగా నిర్వహించిన విన్యాసాల్లో నేవీ అధికారులతో చర్చ గోష్ఠి, పరస్పర సహకారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు నిర్వహించారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న పోర్టు అథారిటీ కమాండెంట్

విశాఖపట్నం, మార్చి 3: కైలాసపురంలోని సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది. విశాఖ పోర్టు అథారిటీ కమాండెంట్ సతీష్‌కుమార్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించడంతో తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోర్టు హాస్పటల్ సీఎంవో డాక్టర్ ఎస్.ఉషాదేవి, అసిస్టెంట్ కమాండెంట్ ఎం ఎంఏ నంద, ఇన్‌స్పెక్టర్ జీఏ.స్వామి, జి.కిరణ్‌కుమార్, ఐ.ఎక్కా, పోర్టు చీఫ్ హెల్త్ ఇనస్పెక్టర్ పి.శ్యామ్ పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 54 వ వార్డు పరిధి ఐటీఐ జంక్షన్ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు వైసీపీ నేత కేకే రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోలియో చుక్కలను వేశారు. వైద్య సిబ్బంది, స్థానికులున్నారు.

అక్కయ్యపాలెం: ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు అన్నారు. ఎనభై అడగుల రోడ్డులోని మున్సిపల్ వార్డు కార్యాలయంలో ఆదివారం పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైసీపీ యువనాయకుడు బాణాల తరుణ్‌కుమార్, గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. 45వ వార్డు సత్యసాయి నగర్‌లో దుర్గాదేవి ఆలయం వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

జ్ఞానాపురం: పోలియో రహిత సమాజనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్లపూర్ణిమ అన్నారు. జ్ఞానాపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పీవీ తెలుగు జాతి ముద్దుబిడ్డ

▸▸ 'పీవీపై నాలుగు మంచిమాటలు' సభలో వక్తలు



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

జగదాంబ కూడలి, మార్చి 3: మాజీ ప్రధాని, భారత రత్న దివంగత నేత పి.వి. నరసింహారావు తెలుగు జాతి ముద్దు బిడ్డ అని మేధావులు, ప్రముఖులు కొనియాడారు. వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ పి.వి.నారాయణరావు అధ్యక్షతన ఆదివారం నగరంలోని దసపల్లా హోటల్‌లో పీవీ గురించి నాలుగు మంచిమాటలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సభలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు మాట్లాడుతూ, 1991 దేశంలో సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రధాని పదవి చేపట్టిన పి.వి. నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశాన్ని ఒడ్డుకు చేర్చారన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పీవీ భారతదేశం ఆరాధ్యుడిగా అభివర్ణించారు. దళితుల కోసం సొంతభూమి 800 ఎకరాలను అందించి భూసంస్కరణలకు నాంది పలికారని పేర్కొన్నారు. పీవీ మనమడు ఎస్.వి.సుభాష్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలను రాజకీయాల్లో పీవీ ప్రోత్సహించారని అన్నారు. పీవీ సాహితీవేత్త, మేధావి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ పి.వి నారాయణరావు, ప్రముఖులు గిడుగు రుద్రరాజు, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌డాక్టర్ వాణి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, సొసైటీ సభ్యులు ఎస్వీ సుభాష్,న్యాయవాది నరసింహమూర్తి, హనుమంతరావు, నండూరి సుబ్ర హ్మణ్యం, అరుణ్‌కుమార్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

హిందీని యూఎన్ఓ అధికార భాషగా ప్రకటించాలి

సిరిపురం: హిందీ భాషను ఐక్యరాజ్య సమితి అధికార భాషగా ప్రకటించాలని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన ఏయూలో విలేకరులతో మాట్లాడారు. హిందీ ద్వారా విదేశాల్లో భారతీయ సంస్కృతిని వ్యాప్తి చేసేందుకు మోదీ కృషి చేస్తుండడం అద్భుతమన్నారు. అందులో భాగంగానే తనను విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడిగా చేశారని చెప్పారు.

ముగిసిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష పోటీలు



సర్టిఫికెట్లు అందిస్తున్న బీజేపీ నేత నరసింగరావు

విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 3: వాడోక్రై కరాటే అసోసియేషన్ నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష పోటీలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఇండోర్ హా ల్లో జరిగిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభను ప్రదర్శించి వివిధ కేటగిరిలలో ఉత్తీర్ణత సాధించారు. చిగురుపల్లి సతీష్‌కుమార్ చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించిన పోటీల ముగింపు కార్యక్రమానికి జనసేన నేత డాక్టర్ బొడ్డేపల్లి రఘు, బీజేపీ నేత కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ధ్రువపత్రాలు, బెల్ట్‌లు అందించారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఝాన్సీ



కరపత్రాలు అందిస్తున్న బొత్స ఝాన్సీ

అక్కయ్యపాలెం, మార్చి 3 : విశాఖ పార్లమెంట్ వైసీపీఅభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు ఆదివా రం సాయంత్రం 46వ వార్డు కస్తూరినగర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కస్తూరినగర్, శాతిపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ సనపల చంద్రమౌళి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా కలేనా? ; కాంగ్రెస్



ఓబీసీ నేత వెంకటరావు

మురళీనగర్, మార్చి 3; ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా హామీ అమలులో కేంద్ర ప్రభు త్వం నిర్లక్ష్యం వహించడం తగదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రా ష్ట్ర ఛైర్మన్ మూల.వెంకటరావు అన్నారు. రాష్ట్రానికి పదేళ్లపాటుప్రత్యేక హోదా అవసరమని మోదీ, వెంకయ్యనాయుడు పట్టుబట్టి అధికారంలోకి వచ్చారన్నారు. వెనుకబాటుకు లోనైన ఉత్తరాంధ్ర, రాయలసీమ లు ప్రత్యేక హోదా వల్ల కేంద్ర ప్రభుత్వ రాయితీలతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

... 5వ పేజీ తరువాయి

నేతలు శ్రీభరత్, బొండా జగన్ పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన నిరసనలకు పార్టీ ఆదినుంచీ అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మించిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉక్కు పరిరక్షణకు వైసీపీ కట్టుబడి ఉందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జనసేన నాయకులు కోనతాతారావు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దీక్షలకు సంఘీభావం తెలిపారన్నారు. ఉక్కు పరిరక్షణకు జనసేన అండగా ఉంటుందన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సీహెచ్ నరసింగరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు జేవీ సత్యనారాయణమూర్తి, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్‌లు మాట్లాడుతూ ఉక్కును ముంచేలా కేంద్రం విధానాలు ఉన్నాయన్నారు. బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలు పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపాయన్నారు. ప్రభుత్వరంగాలను తాబేదార్లకు అప్పగించాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా అప్పుల ఊబిలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేటీకరణకు పూనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు.

యాత్రకు భారీ స్పందన

ఉక్కు కార్మికులు నిర్వహించిన మహా పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నగరవాసులు కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏసీపీలు త్రినాథ్, రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో దువ్వాడ, స్టీలుప్లాంట్, పెదగంట్యాడ స్టేషన్లకు చెందిన పోలీసులు ఉక్కు కార్మికులతో పాటు తరలివెళ్లారు. పాదయాత్రలో జనసేన నాయకులు కోన తాతారావు, వామపక్ష నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, జెర్రిపోతుల ముత్యాలు, నీరుకొండ రామచంద్రరావు, అడుసుమిల్లి దీప్తి, గంధం వెంకటరావు, సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, మస్తానప్ప, విళ్ల రామ్మోహన్ కుమార్, నమ్మి సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, పులి వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంపై ఎందుకంత ప్రేమ?

... 5వ పేజీ తరువాయి

వామపక్షాలు చేపట్టిన మహా పాదయాత్రలో పాల్గొని, ప్లకార్డు పట్టుకుని కొంత దూరం నడిచి ఉద్యమానికి మద్దతు ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసింది.

గాజువాక టికెట్‌పై ఆశతోనే...

గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేదిలేదని అధిష్ఠానం స్పష్టం చేయడంతోపాటు సమన్వయకర్తగా కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును నియమించింది. చందు అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాగిరెడ్డి తనకు టికెట్ ఇవ్వకపోయినా చందుకు మాత్రం ఇవ్వొద్దని అధిష్ఠానానికి షరతు విధించినట్టు సమాచారం. దీంతో యాదవ సామాజికవర్గానికే గాజువాక టికెట్ కేటాయించాలనే ఆలోచనలో వైసీపీ పెద్దలు ఉండడంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేరును నాగిరెడ్డి ప్రతిపాదించినట్టు ప్రచారం జరుగుతోంది. అందులోభాగంగానే మేయర్ హరివెంకటకుమారిని ప్రతిరోజూ గాజువాక నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు నాగిరెడ్డి ఆహ్వానిస్తున్నారని వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. గాజువాక నుంచి పోటీకి గ్రీన్‌సిగ్నల్ లభిస్తుందనే ఆశతోనే మేయర్ గాజువాకపై ప్రత్యేక దృష్టిసారించారని, అందులోభాగంగానే స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో మొదటిసారి ప్రత్యక్షంగా పాల్గొన్నారని విశ్లేషిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం?

... 5వ పేజీ తరువాయి

ఎంపికచేసిన పాఠశాలలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) బృందం పరిశీలించనుంది. ఈ బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. సోమవారం నుంచి విశాఖ జిల్లాలోని పది మండలాల్లో ఒక్కో పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించనుంది. ఆయా పాఠశాలల్లో వసతులు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలను బృంద సభ్యులు తనిఖీ చేయనున్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

పోలీస్‌స్టేషన్ నుంచి ఒక అధికారిని వెంటనే పంపించి సమస్య పరిష్కరించాలని ఆదేశిస్తున్నామన్నారు. భూ కబ్జాలపై ఎవరైనా ధైర్యంగా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని, కచ్చితంగా వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూ కబ్జాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం, నగర బహిష్కరణ శిక్ష విధించేలా శాఖా పరంగా ప్రయత్నిస్తామన్నారు. పరదేశిపాలెంలో ఆదివారం కంటైనర్‌లో తరలిస్తున్న గంజాయిని తమ సిబ్బంది పట్టుకున్నారన్నారు. పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న ఫొటోగ్రాఫర్ సాయి అదృశ్యంపై తమకు ఈనెల 29న ఫిర్యాదు అందిందని, అతడి వద్ద రూ.లక్షలు విలువ చేసే కెమెరా ఉండడంతో దాని కోసమే అతడ్ని హత్యచేసి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. ఆలమూరు వద్ద సాయి మృతదేహం లభ్యమైందని, ఈ కేసులో ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీలు మణికంఠచందోలు, సత్యనారాయణ, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌కోర్ట్ తొలగింపుపై మీనమేషాలు!

... 5వ పేజీ తరువాయి

కొనసాగింపునకు అధికారపార్టీ నేతలంతా సానుకూలంగా ఉన్నపుడు మనమెందుకు అనవసరంగా జోక్యం చేసుకోవాలనే భావనతో అధికారులు కూడా చోద్యం చూస్తున్నారు. ఇదిలావుండగా ఫుడ్‌కోర్ట్‌లోని దుకాణాల నుంచి పాలకవర్గంలోని కొందరు పెద్దలు, వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధితోపాటు అధికారులకు కూడా ప్రతిరోజూ వాటాలు అందుతున్నాయని ప్రతిపక్ష కార్పొరేటర్లు ఆరోపిస్తున్నా వారి నుంచి స్పందనలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రామయ్య

రాజకీయాల్లో రాణించేందుకు కాపులు ముందుకు రావాలి

మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 3: గాజువాకలో కాపులు అధిక సంఖ్యలో ఉన్నందున రాజకీయంగా రాణించేందుకు ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆకాంక్షించారు. శ్రీకృష్ణదేవ రాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్టీల్‌ప్లాంట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమష్టిగా ముందుకు సాగాలన్నారు. సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అందరూ సహాయం చేయాలన్నారు. విద్య, వైద్య, సేవా పరంగా సంఘం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, రౌతు శ్రీనివాసరావు, వెంకటరమణ, బాబూరావు, నూకరాజు, అప్పారావు, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా నేత్ర వైద్య పరీక్షలు

పెదగంట్యాడ, మార్చి 3: ఆరోగ్యశ్రీ ద్వారా నేత్ర వైద్య పరీక్షలు, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని డాక్టర్ పావని బెస్ట్ విజన్ అడ్వాన్స్‌డ్ ఐ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ మహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆరోగ్యశ్రీ కార్డు హోల్డర్లకు గాజువాకలోని తమ ఆస్పత్రిలో వైద్య చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ చూపాలి'

గాజువాక, మార్చి 3: ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాక అమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత దైనందిన జీవితంలో ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటిస్తూ మంచి ఆహారాన్ని అందరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వినికిడి పరీక్ష శిబిరం ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, మార్చి 3: పిల్లల్లో వినికిడి సమస్యను సకాలంలో గుర్తించి కాంక్లియర్ ఇంప్లాంట్ చికిత్స ద్వారా వినడమే కాకుండా మాట్లాడే అవకాశాన్ని కలిగించగలమని ప్రముఖ ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ సాయి బలరామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ వినికిడి దినోత్సవం సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వినికిడి పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 60 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వినికిడి సమస్య పరిష్కారానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు.

అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు బంగార్రాజుకు ఆహ్వానం

పెదగంట్యాడ, మార్చి 3: వంగూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో కాకినాడలో జరగనున్న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సుకు హాజరు కావాలంటూ నటుడు, నాటకరచయిత, దర్శకుడు కొత్తపల్లి బంగార్రాజుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సుకు తాను హాజరై ఆధునిక తెలుగు నాటక రంగం అనే అంశంపై ప్రసంగించనున్నట్టు బంగార్రాజు తెలిపారు.



కొత్తపల్లి బంగార్రాజు

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 20, క్యారెట్ 26, దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 60, బరబాటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీర దోస 28, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 24 , కంద 64, దేముడుచిక్కుడు 52, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్రాయిలర్		
రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

భద్రతతోనే భవిష్యత్తు

- పరిశ్రమల్లో భద్రతకు పెద్దపీట వేయాలి
- అజాగ్రత్త వల్లే పారిశ్రామిక, రోడ్డు ప్రమాదాలు
- నేడు జాతీయ భద్రతా దినోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 3:

నిత్య జీవితంలో భద్రత చాలా ముఖ్యం. భద్రత పాటిస్తే అన్ని విధాల మేలు. మానవుని రక్షణతో పాటు సంస్థల అభివృద్ధి భద్రతపైనే ఆధారపడి ఉంటుంది. భద్రతతో కూడిన ప్రదేశాల్లో విధులు నిర్వహిస్తే అన్ని విధాల శ్రేయస్కరం. సోమవారం జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



జాతీయ భద్రత మండలి ఏర్పాటు

భారత ప్రభుత్వం, శ్రామిక మంత్రిత్వ శాఖ 1966 మార్చి నాలుగున జాతీయ భద్రత మండలిని స్థాపించింది. భద్రత, ఆరోగ్యం, పర్యావరణాలపై అవగాహన పెంపొందించడం ఈ మండలి ప్రధాన లక్ష్యం. సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సెమినార్లతో పాటు సేఫ్టీ ఆడిట్లు వంటి కార్యక్రమాలను ఈ మండలి నిర్వహిస్తుంది. భద్రత మండలి ఆధ్వర్యంలోనే రహదారి భద్రత దినోత్సవాలు, అగ్నిమాపక వారోత్సవాలు, ప్రపంచ పర్యావరణ దినోత్సవాలను నిర్వహిస్తారు. పనిచేసే ప్రదేశంలో భద్రతను పెంపొందించడానికి ఏటా మార్చి నాలుగున జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృత్యువాత

దేశంలో ప్రకృతి వైపరీత్యాల కన్నా రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది దుర్మరణం చెందుతున్నారు. మన దేశంలో ఏడాదికి సుమారు 70 వేల నుంచి లక్ష మంది కేవలం రోడ్డు ప్రమాదాల్లోనే మృతి చెందుతున్నారు. ఈ రోడ్డు ప్రమాదాలు అధికంగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయి. వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, అతి వేగం, ఏమీ కాదులే అన్న ధీమాతో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు.

పరిశ్రమల్లో భద్రత చాలా ముఖ్యం

పరిశ్రమల్లో భద్రత చాలా ముఖ్యం. ఏ మాత్రం చిన్న పొరపాటు చోటుచేసుకున్నా విలువైన ప్రాణాలతో పాటు సంస్థకు తీరని నష్టం వాటిల్లుతుంది. పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికులు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. పని ప్రదేశం గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలి. భద్రతా పరికరాలు ధరించి విధులు నిర్వర్తించాలి. భద్రత విషయంలో ఏ మాత్రం అనుమానం ఉన్నా అధికారులకు సమాచారమిచ్చి అక్కడ నుంచి నిష్క్రమించాలి. ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతను పాటించాలి. పని ప్రదేశంలో సూచించిన భద్రతా చర్యలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

1962లో కార్మికుల భద్రతపై చర్చ

ప్రపంచ పారిశ్రామిక కేంద్రమైన ముంబైలో 1962లో కార్మికుల భద్రతపై చర్చ జరిగింది. దేశంలోని అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల సమావేశంలో ప్రమాదాల నివారణ కోసం చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రమాదాల నివారణకు ముఖ్యంగా ప్రచారం అవసరమని, దానిని నిర్వహించడానికి, కార్మికుల్లో భద్రత పట్ల అవగాహన పెంచేందుకు ప్రభుత్వ పరంగా ఓ సంస్థ అవసరమని గుర్తించారు. ఆ తరువాత పారిశ్రామిక భద్రతపై తొలి సమావేశాన్ని 1965లో ఢిల్లీలో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొని జాతీయ, రాష్ట్ర స్థాయిలో భద్రత మండలిని ప్రారంభించాలని నిర్ణయించారు. ఆ విధంగా 1966 మార్చి నాలుగున జాతీయ భద్రతా మండలి ఏర్పాటైంది.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ భద్రత, ఆరోగ్యం, పర్యావరణ అంశాలను దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరవేయడం ప్రధాన లక్ష్యం. పారిశ్రామిక వర్గానికి చెందిన వారందరినీ ఇందులో భాగస్వాముల్ని చేసి అందరికీ భద్రతపై అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలను చేపడుతుంది. భద్రత కల్పించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్రను గుర్తెరిగి అనుసరింపజేసేందుకు ఈ సంస్థ కృషి చేస్తుంది.

అజాగ్రత్త వల్లే ప్రమాదాలు

ప్రతి పనిలోనూ ఏదో ఒక ప్రమాదం పొంచి ఉంటుంది. కొన్ని రకాల ప్రమాదాలను ముందుగా పసిగట్టలేం. కానీ ప్రమాదాల్లో అధిక శాతం అజాగ్రత్త వల్లే జరుగుతున్నాయి. అవి రోడ్డు ప్రమాదలైనా, పారిశ్రామిక ప్రమాదాలైనా సరే. రోడ్డు, పారిశ్రామిక ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నందున పారిశ్రామిక, రహదారి భద్రతలపై ప్రభుత్వాలు, యాజమాన్యాలు మరింత దృష్టిసారించాయి. ప్రాణ నష్టం అధికంగా ఉన్న ఈ రంగాలతో పాటు అగ్ని ప్రమాదాల నివారణ గురించి కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పరిశ్రమల్లో భద్రత చాలా ముఖ్యం

-జి.కిశోర్, ఉక్కు ఉద్యోగి



పరిశ్రమల్లో భద్రత చాలా ముఖ్యం. భద్రత వల్లే సంస్థ ప్రగతిపథంలో పయనిస్తుంది. సంస్థలో పనిచేసే కార్మికునికి భద్రత పరంగా అన్ని సౌకర్యాలు కల్పించినప్పుడే ఉద్యోగి మంచి వాతావరణంలో విధులు నిర్వహిస్తాడు. భద్రతకు ఏ సంస్థ అయితే ప్రాధాన్యం ఇస్తుందో అక్కడ మంచి వాతావరణం నెలకొంటుంది.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పలు ప్రాంతాల్లో చిన్నారులకు చుక్కల మందు వేసిన ప్రజాప్రతినిధులు

పెదగంట్యాడ, మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మించడంలో అందరూ భాగస్వాములు కావాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయడం ద్వారా పోలియోను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ నాయకుడు పులి వెంకట రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే నడుపూరు కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వికాస్‌నగర్ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, నెల్లిముక్కులో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి చిన్నారులకు చుక్కల మందు వేశారు.

గాజువాక: పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని ప్రాంతాల్లో ఆదివారం పోలియో చుక్కల ముమ్మరంగా చేపట్టారు. ప్రతి కూడలి వద్ద ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పలుచోట్ల పోలియో చుక్కలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్ ఏజే స్టాలిన్, పలువురు అధికారులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కూర్మన్నపాలెం: పోలియో రహిత సమాజ స్థాపనే ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి కణితి పీహెచ్‌సీలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు. పీహెచ్‌సీ వైద్యుడు టి.శివయ్య మాట్లాడుతూ తమ పరిధిలోని తొమ్మిది సచివాలయాల్లో 3,930 మంది చిన్నారులకు 3,746 మందికి (96 శాతం) పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు వడ్లపూడిలో వైసీపీ నాయకులు పి.వేణుబాబు, బి.గోవింద్, బి.గోవిందరాజులు, డి.దానప్పలు, దామోదర్, తదితరులు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు

గోపాలపట్నం: పల్స్ పోలియో కార్యక్రమంపై అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు రెండు రోజులుగా విస్తృత ప్రచారం చేయడంతో ఉదయం నుంచే ఐదేళ్లలోపు చిన్నారులను తల్లిదండ్రులు ఆయా కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కల మందు వేయించారు. 89వ వార్డులోని పలు కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపి ప్రారంభించారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లోని చిన్నారులకు వైసీపీ కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీ సురేష్, పీవీ సురేశ్, కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, టీడీపీ కార్పొరేటర్ గల్లా చిన్నా పోలియో చుక్కలు వేశారు. అలాగే కొన్నిచోట్ల వైసీపీ, టీడీపీ నాయకులు పిల్లలకు చుక్కల మందు వేశారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు పరిధి తుంగ్లాంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఐదేళ్లలోపు పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం కేంద్రాల వద్ద సిబ్బంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

అగనంపూడి: చిన్నారుల బంగారు భవిష్యత్తుకు ప్రతిఒక్కరూ పోలియో చుక్కలు వేయించాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలోని కేఎస్ఎన్ రెడ్డినగర్, పాత అగనంపూడిలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలువురి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింగిడి సింహాచలం, కరణం జగదీశ్, బొబ్బరి సూర్య తదితరులు పాల్గొన్నారు. అలాగే 85వ వార్డు పరిధి అగనంపూడి, పరిసర ప్రాంతాల్లోని పలు కేంద్రాల్లో కార్పొరేటర్ ఇలపు వరలక్ష్మి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పెందుర్తి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర పరిధి, గ్రామీణ వైద్య ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది డాక్టర్ దీపిక పర్యవేక్షణలో 64 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి ఆరువేల మంది చిన్నారులకు చుక్కల మందు వేశారు. పెందుర్తిలో జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో నాయకులు పెంటకోట రాజేంద్రప్రసాద్, పీలా జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 93వ వార్డు పరిధిలోని విరాట్‌నగర్, ప్రహ్లాదపురం, దుర్గానగర్ సచివాలయాల్లో పలువురు చిన్నారులకు కార్పొరేటర్ రాపర్తి కన్నా పోలియో చుక్కలు వేశారు. 52వ వార్డు శాంతినగర్, మర్రిపాలెం, పరిసర ప్రాంతాల్లో చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ చుక్కల మందు వేశారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, మార్చి 3: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. 61వ వార్డులోని మరిడిమాంబ ఆలయంలో ఆదివారం సాయంత్రం ఆయన ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు మంగళ హారతులిచ్చి స్వాగతం పలికారు. ప్రజలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని అభివృద్ధి అంతా టీడీపీ హయాంలో చేపట్టినదేనన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్న, నాయకులు మజ్జి సోమేశ్, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గణబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మహిళలు

మర్రిపాలెం వుడా కాలనీలో..

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం వుడాకాలనీ, వాకింగ్ పార్క్‌లో వాకర్స్, షటిల్ కోర్టుల్లోని క్రీడాకారులను ఎమ్మెల్యే గణబాబు కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం వారితో కాసేపు షటిల్ ఆడారు.

గణబాబుకు మహిళల సంఘీభావం

గోపాలపట్నం: రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పి.గణబాబు అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం ఖరారు చేయడం.. ఆయన ప్రచారం చేపడుతుండడంతో 91వ వార్డుకు చెందిన తెలుగు మహిళ నాయకురాలు బొడ్డేటి ఉమ ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఆయనకు సంఘీభావం తెలిపారు. ఈ మేరకు గణబాబును ఆయన నివాసంలో ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉరుకూటి చందు

గాజువాకలో వైసీపీ జెండాను ఎగరవేద్దాం

నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి చందు

గాజువాక, మార్చి 3: రానున్న ఎన్నికల్లో గాజువాకలో వైసీపీ జెండాను ఎగరవేద్దామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. గాజువాకలో ఆదివారం సిద్ధం పేరుతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమ విజయానికి కారణమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, గుడివాడ అనూష, నాయకులు లతీశ్, శ్రీనివాస్, దొడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

అక్కిరెడ్డిపాలెం, మార్చి 3: నెల్లూరు జిల్లా కావలిలో ఈ నెల ఎనిమిది నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే విశాఖ జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ మైదానంలో నిర్వహించిన జట్టు ఎంపిక పోటీలకు సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొని పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపిక పోటీల్లో 18 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరికి సోమవారం నుంచి మూడు రోజుల పాటు పోర్టు స్టేడియంలో శిక్షణ ఇస్తామని, ఆ తర్వాత తుది జట్టును ఎంపిక చేస్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజేశ్వరి, అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ జట్టు ఎంపిక కార్యక్రమంలో జాతీయ కోచ్ ఎం.ఉమాశంకర్‌బాబు, పి.దాసు, ఎం.గణపతి, పల్లా రమణ, ప్రకాశ్, సత్యనారాయణ, కాళీప్రసాద్, శివ, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

క్రైం... crime news



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ రవి శంకర్

49 కేసుల్లో రూ.1.51 కోట్ల విలువైన సొత్తు రికవరీ

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి భారీగా సొత్తు రికవరీ చేసినట్టు సీపీ రవి శంకర్ అయ్యన్నార్, జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప తెలిపారు. నిందితుల నుంచి రికవరీ చేసిన సొత్తుని చట్టపరంగా బాధితులకు అందజేసే క్రమంలో 'రికవరీ మేళా' పేరుతో ఆదివారం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది ఫిబ్రవరి నెలలో 86 దొంగతనాలు జరిగాయన్నారు. ఈ చోరీల్లో దాదాపు రూ.1.51 కోట్ల విలువైన సొత్తుని నిందితులు అపహరించుకుపోయారన్నారు. 86 కేసుల్లో 49 కేసులను చేదించడంతో పాటు చోరీలకు పాల్పడిన 60 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. నిందితుల నుంచి రూ.1,00,42,051 విలువ చేసే సొత్తును రికవరీ చేశామన్నారు. అలాగే గత నెల 7న రాత్రి పది గంటల నుంచి నాకా బందీ పేరుతో నగరమంతా ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా భారీగా గంజాయి, మద్యం, నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దీంతో పాటు రూ. 9 కోట్ల విలువ చేసే 14.47 కిలోల బంగారం, 13.31 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు. నగరంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి నుంచి 'చాట్‌బాట్' పేరుతో ఫిర్యాదులు స్వీకరించామని, గత నెలలో పోయిన సెల్‌ఫోన్లలో 376 ఫోన్లను రికవరీ చేశామని, వాటిని బాధితులకు అందజేస్తామన్నారు. వీటి విలువ రూ. 56 లక్షలు ఉంటుందని చెప్పారు. చాట్‌బాట్ ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ 1155 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని వీటి విలువ రూ.1.73 కోట్లు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు మణికంఠ చందోలు, సత్యనారాయణ, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, క్రైమ్ ఏసీపీ వెంకటరావు, సీఐలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు

బక్కన్నపాలెం ఫొటోగ్రాఫర్ సాయి మృతదేహం లభ్యం



ఆలమూరు మండలం జొన్నాడ సమీపాన గోదావరిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

కొమ్మాది, మార్చి 3: మధురవాడలోని బక్కన్నపాలేనికి చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం వద్ద హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలేనికి చెందిన పోతిన సాయిపవన్ ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఫొటో షూట్‌లు చేస్తుంటాడు. తండ్రి శ్రీను ఆటోడ్రైవర్ కాగా తల్లి రమణమ్మ కార్ షెడ్ జంక్షన్‌లో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా పెద్దవాడు సాయి పవన్ (22) ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఫొటోషూట్ చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన షణ్ముఖ తేజ తాను కూడా ఫొటో షూట్ చేస్తుంటానని, ఫోన్ ద్వారా సాయిని పరిచయం చేసుకున్నాడు. షణ్ముఖ తేజ, సాయి వద్ద రూ.15 లక్షల విలువైన హై టెక్నాలజీ కెమెరాలు ఉన్నట్టు తెలుసుకున్నాడు. వాటిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సాయికి ఫోన్ చేసి రావులపాలెంలో పెద్ద ఈవెంట్ ఉందని, నీ దగ్గర ఉన్న కెమెరాలతో ఇద్దరం కలిసి ఈవెంట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని నమ్మబలికాడు. దీంతో సాయి గతనెల 26న విశాఖ నుంచి రైలులో బయలుదేరి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి షణ్ముఖ తేజ కారును అద్దెకు తీసుకొచ్చి దారి మధ్యలో హత్య చేసి జొన్నాడ వద్ద గోదావరి ఇసుక తిన్నెల్లో పాతి పెట్టారు. రూ.15 లక్షల విలువ చేసే కెమెరాలు, ఇతర సామగ్రిని పట్టుకుని పారిపోయారు. అయితే ముందుగా తనకు ఏదో ఆపద జరుగుతుందని గమనించిన సాయి కారు నంబర్‌ను తన తల్లికి వాట్సాప్ చేశాడు. తన ఫోన్ నంబర్ పని చేయకపోతే వేరే నంబర్‌కు ఫోన్ చేయమని తేజ నంబర్ పంపాడు. తన కుమారుడు ఆపదలో ఉన్నాడనే విషయాన్ని తల్లి తెలుసుకోలేకపోయింది. ప్రతిరోజూ మాట్లాడేవాడు రెండు రోజులుగా ఫోను చేయలేదని అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సమాచారంతో గతనెల 29న పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయి పంపించిన కారు నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడు రావులపాలేనికి చెందిన షణ్ముఖ తేజగా గుర్తించారు. సాయి కుటుంబ సభ్యులు పీఎం పాలెం సీఐ రామకృష్ణ సూచన మేరకు రావులపాలెం వెళ్లగా అప్పటికే షణ్ముఖ పరారీలో ఉన్నాడు. అతని తల్లిదండ్రులను పోలీసులు విచారించగా సాయిని హత్య చేసి, కెమెరాలను పైన గదిలో పెట్టినట్టు చెప్పడంతో పోలీసులు గది తాళాలు పగులకొట్టి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కెమెరాలను, షణ్ముఖ తండ్రిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చారు.

అమ్మాయితో చాటింగ్ చేయించి, పట్టుకున్నారు

నిందితుడు షణ్ముఖ తేజ మొదటి నంబరు స్విచ్ఛాఫ్‌లో ఉండగా రెండవ నంబర్‌ను పోలీసులు ట్రేస్ చేసి అన్నవరంలో ఉన్నట్టు గుర్తించారు. అక్కడికి వెళ్లేసరికి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం షణ్ముఖ తేజకు నగరంలోని కంచరపాలేనికి చెందిన అమ్మాయికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఉన్నట్టు గుర్తించి ఆ అమ్మాయిని, ఆమె తల్లిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమెతో షణ్ముఖకు ఫోన్‌లో చాటింగ్ చేయించారు. ఆమె మెసేజ్‌కు షణ్ముఖ స్పందించడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం షణ్ముఖ ఇచ్చిన సమాచారం మేరకు సాయిని చంపి పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులు గుర్తించారు. అనంతరం పవన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే ఈ కేసులో కేవలం కెమెరాల కోసమే షణ్ముఖ ఇంతకు తెగించాడా లేదా మరో కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబ సభ్యుల రోదన

వారం రోజుల క్రితం అదృశ్యమైన కుమారుడు సాయి మృతదేహం చూసి తల్లిదండ్రులు శ్రీను, రమణమ్మ బోరున విలపించారు. తమతో ఎంతో సరదాగా ఉండే సాయిని దారుణంగా చంపేశారంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

కూర్మన్నపాలెం, మార్చి 3: పదో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేసిన యువకుడిని దువ్వాడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. దువ్వాడకు గ్రామానికి ఉగ్గిన సాయికుమార్ అనే యువకుడు స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికి పలుమార్లు బయటకు తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేస్తుండడం, పాఠశాలకు వెళుతున్నట్టు చెప్పి ఆ బాలిక సాయికుమార్‌తో బయటకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చేది. కాగా ఫిబ్రవరి 29న రాత్రయినా తమ కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులతో పాటు అన్నదమ్ములు, కుటుంబ సభ్యులు దువ్వాడ పరిసరాల్లో గాలించసాగారు. ఈ క్రమంలో సాయికుమార్‌తో బాలిక ఉండడాన్ని వారు గుర్తించారు. దీంతో తల్లిదండ్రులు కుమార్తెను ప్రశ్నించడంతో జరిగిన విషయాన్ని వెల్లడించడంతో శనివారం వారు పోలీసులను ఆశ్రయించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సాయికుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'ఐడియల్ గాంధర్వ' గాయకుల ఎంపిక



ఘంటసాల చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గాయకులు, ప్రముఖులు

డాబాగార్డెన్స్, మార్చి 3: ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకులు డాక్టర్ టి.శరత్‌చంద్ర సారథ్యంలో ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడియల్ గాంధర్వ పేరిట గాయనీగాయకుల ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, ఎన్‌ఆర్‌ఐలు జి.రాము కే.సుధారాణి జ్యోతి ప్రజ్వలనగావించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలోని 10 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వరకు గాయనీగాయకులు పాల్గొని పాటలు పాటారు. ప్రతిభ ఆధారంగా కొందరిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. త్వరలో ఘంటసాల గాన మాధుర్యాన్ని కీర్తిస్తూ 140 ఎపిసోడ్‌లతో ప్రేక్షకుల చెంతకు ఈ కార్యక్రమం చేరుతుందన్నారు.కార్యక్రమంలో వి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యశర్మ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, జె.పృథ్వీరాజ్, మెలోడి సత్యనారాయణ, కందర్పరాధ, పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడియల్ గాంధర్వ లోగోను సినీ నటులు సుమన్ ఆవిష్కరిస్తారని, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి ప్రదర్శన ఉంటుందన్నారు.

'విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి చేయూతనివ్వాలి'



మాట్లాడుతున్న బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరసింహ ఆచారి

మహారాణిపేట/ జగదాంబ, మార్చి 3: విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి రూ.500 కోట్లు మూలధనం ఏర్పాటు చేయాలని టీడీపీ విశ్వబ్రాహ్మణ సంఘం బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గోడి నరసింహ ఆచారి డిమాండ్ చేశారు. ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు వండ్రంగి, స్వర్ణకారులు, కంచరపని, కమ్మరి, శిల్పి తదితర చేతివృత్తులపై ఆధారపడిన ఎంతోమంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారన్నారు. నగరంలో 15 లక్షల మంది జనాభా నివసిస్తున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలో విశ్వబ్రాహ్మణుల కోసం రూ. 50 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అలాగే, విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబును కలసి సమస్యలు వివరిస్తామన్నారు. అలాగే, టౌన్ హాల్ వద్ద విశ్వ బ్రాహ్మణులు నిరసన తెలిపారు. ఈసమావేశంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

'రాజ్యాంగంపై వ్యతిరేకత తగదు'

సీతంపేట, మార్చి 3: భారత రాజ్యాంగంపై వ్యతిరేకత తగదని ప్రముఖ రచయిత గుంటూరు లక్ష్మీ నరసయ్య పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో భీమ్ సేన వార్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీ నరసయ్య 'భారత రాజ్యాంగం అవగాహన, ఉద్దేశపూర్వక వక్రీకరణలు' అనే అంశంపై మాట్లాడారు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే కుల నిర్మూలన పోరాటాలను వ్యతిరేకించినట్టేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన ఏయూ ప్రొఫెసర్ సత్యపాల్ విజయవాడలో అంబేడ్కర్ ఫొటో గ్యాలరీ, ప్రత్యేకతలు అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ వేమన, డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, మధుకుంచే, వై.బాలకృష్ణ, ఓంకార్ ప్రసాద్, గుడివాడ అప్పారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో త్వరలో భారత్ అత్యున్నత స్థానం



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

మహారాణిపేట, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హయాంలో స్థాపించిన టెక్ విజన్ సాఫ్ట్‌వేర్ సంస్థ మరో ఐదేళ్లలో లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందని తెలుగుదేశం పార్టీ యువనేత ఆడారి కిశోర్ కుమార్ అన్నారు. ఆదివారం బీచ్ రోడ్డులోని పార్కు హోటల్‌లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టెక్ విజన్ సంస్థ ప్రతిభా అవార్డుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆడారి కిశోర్ మాట్లాడుతూ పదివేల మంది ఉద్యోగులు ఉన్న తమ సంస్థ మరింత ఉన్నతి సాధించనున్నదని, దేశ విదేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు.సంస్థ డైరెక్టర్ హేమంత్ మాట్లాడుతూ విశాఖలో కంపెనీల సంస్కృతి పెరుగుతుందని, మరికొన్నాళ్లలో అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరచిన ఉద్యోగులకు బహుమతులు అందించారు ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను దగా చేస్తున్న వైసీపీ ప్రభుత్వం'



టీడీపీ బీసీ సెల్ నేత వెంకటేశ్వరరావు

అక్కయ్యపాలెం, మార్చి 3 : వైసీపీ ప్రభుత్వం బీసీలను దగా చేస్తోందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్వరరావు మండిపడ్డారు. స్థానికకార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఆ యన మాట్లాడారు. రాజకీయంగా, ప్రభుత్వ పరంగా, ఉద్యోగుల విషయంలో బీసీలను తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఒక్క రెడ్డి సామాజిక వర్గానికి మాత్రమే ప్రా ధాన్యతనిస్తోందని చెప్పారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో మూడు స్థానాల్లో రెండు రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏయూ వీసీగా రెండో సారి కూడా ఆ సామాజిక వర్గానికే కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ పదవి కూడా గత నాలుగేళ్లుగా రెడ్డి వర్గానికే ఇచ్చారన్నారు. చూస్తే వైసీపీ బీసీలకు ఎంత అన్యాయం చేస్తుందో అర్థమవుతుందన్నారు. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ త్రినాథ్, విశాఖ పార్లమెంటరీ తూర్పు కాపు అధ్యక్షుడు దొడ్ల వెంకట జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14162

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైభవంగా బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవం



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు, అతిథులు



గురువుకు నమస్కరిస్తున్న సినీ నటుడు శుభలేఖ సుధాకర్

సీతమ్మధార, మార్చి 3: నగరంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ఫౌండర్ ప్రెసిడెంట్ కె.జయభారత్ రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోల్డెన్ జూబ్లీ హాల్‌నుప్రారంభించారు. ఈసందర్భంగా ఎ.జయభరత్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల 50 ఏళ్ల వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ అర్ధ శతాబ్దిలో కళాశాల ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఎందరికో ఉపాధి అవకాశాలు దక్కించుకునే లా యాజమాన్యం కృషి చేసినట్టు వివరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మరో ఏభై ఏళ్లు ఇలానే ఉన్నత విద్య అవకాశాలు తమ విద్యార్థులు అందుకునేలా అధ్యాపక బృందం కృషి చేయాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ మధుకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధి అవకాశాల దృష్ట్యా ఆధునిక పరిజ్ఞానంతోపాటు పారిశ్రామిక నైపుణ్య శిక్షణను అందించే ప్రయత్నంలో భాగంగా కొన్ని కంపెనీలతోతమ కళాశాల భాగస్వామ్యం కలిగి ఉన్నట్టు తెలిపారు. కళాశాల విద్యార్థులకు చదువుతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందన్నారు.

పూర్వ విద్యార్థులుగా ప్రముఖులు

అనంతరంసమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, కళాశాల పూర్వ విద్యార్థి ధర్మాన కృష్ణదాసుమాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాల్లో పాల్గొనడం ఎంతగానో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థి సమయంలో కళాశాలలో గడిపిన క్షణాలు గుర్తుకువస్తున్నాయన్నారు.

కళాశాల ద్వారా ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. కళాశాల తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం జరిగింది. వారు తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థి సినీ నటుడు శుభలేఖ సుధాకర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇతర విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీకి మరో అవకాశమిస్తే శ్రీహరికోటనూ తాకట్టు పెట్టేస్తారేమో?

» సచివాలయం తాకట్టుపై మాజీ మంత్రి గంటా ధ్వజం

అక్కయ్యపాలెం, మార్చి 3 : 'నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ భవనాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాకట్టు పెట్టారని, ఇప్పుడు ఏకంగా రాష్ట్ర సచివాలయంపై బ్యాంక్‌కు గ్యారెంటీ చూపి రుణాన్ని వాడుకోవడం దారుణమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో విమర్శించారు. అప్పుల ఊబిలో మునిగిపోయిన శ్రీలంక కూడా తమ పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టలేదని, కానీ జగనన్నకు సాధ్యమని మరోసారి నిరూపించారని చెప్పారు. మళ్లీ ఇంకో అవకాశం ఇస్తే శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం, సాగర్‌డ్యామ్, శ్రీశైలం డ్యామ్, పోలవరం ఆనకట్టలను కూడా తాకట్టు పెట్టేస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపి, రాష్ట్రా కి ఒక్కరాజధాని కూడా లేకుండా చేసి చివరికి ఉన్న సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారన్నారు. విశాఖలో 13 ప్రభుత్వ ఆస్తులు, భవనాలు, కాలేజీలు తాకట్టు పెట్టి రూ.25వేల కోట్లు, మద్యంపై రూ.48వేల కోట్లు అప్పు తీసుకొచ్చారని తెలిపారు. ఆర్అండ్‌బీ ఆస్తులు తాకట్టు పెట్టి రూ. 7వేల కోట్లు అప్పు చేశారని, కానీ రోడ్లు వేయలేదన్నారు. టిడ్కో ఇళ్ల తా కట్టు పెట్టి రూ.10వేల కోట్ల అప్పు తీసుకొచ్చారని, ఇళ్ల నిర్మాణాలను పూ ర్తి చేయలేదన్నారు. చెత్తతో సహా రకరకాల పన్నులతో రూ.లక్షల కోట్లు ప్రజలపై భారం మోపుతున్నారన్నారు.

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యమివ్వాలి

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్



సంఘీభావాన్ని ప్రకటిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, మార్చి 2: త్వరలో జరగనున్న ఎన్నికల్లో జనాభాలో 50 శాతంపైగా ఉన్న బీసీలకు రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తగిన రీతిలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల టీడీపీ, జనసేన కూటమి ప్రకటించిన తొలి జాబితాలో బీసీలకు కేవలం 21 మందికి టికెట్లు ప్రకటించిందని, ఈ సంఖ్యను మరో 50 శాతానికి పెంచాలన్నారు. సమస్యలపై ఈ నెల రెండో వారంలో గుంటూరులో బీసీ ప్రతినిధులతో రాజకీయ ప్లీనరీ నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల కుమ్మర క్రాంతికుమార్, ఎం.రమణ, శ్రీనివాసరావు, ద్వారకా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీలోనే ప్రభుత్వ ఉద్యోగులకు అధిక జీతాలు

» ముఖ్యమంత్రి సలహాదారు అజేయ్‌కల్లాం

మహారాణిపేట, మార్చి 3: దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకే అత్యధిక జీతాలు చెల్లిస్తున్నామని ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రి సలహాదారు అజేయ్‌కల్లాం అన్నారు. విశాఖలోని ఓ హోటల్‌లో ఆదివారం ట్రాన్స్ ఫార్మింగ్ గవర్నన్స్ పేరుతో నిర్వ హించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే 30 శాతం అధికమన్నారు. ఉద్యోగుల జీతాల చెల్లింపునకే అత్యధికంగా నిధులు ఖర్చుచేయాల్సి వస్తోందన్నారు. గుజరాత్‌లో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు రూ.15 వేల కోట్లు చెల్లిస్తుండగా, ఏపీలో రూ.53 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అభివృద్ధి అంటే రోడ్లు వేయడం, కాంక్రీట్ నిర్మాణాలుకాదన్నారు. మానవ వనరులను అభివృద్ధి చేయడమేనన్నారు. ఇందులో భాగంగా అవసరం లేకున్నా ప్రతి గ్రామానికీ కనీసం పది ఉద్యోగాలను కల్పించాలని సచివాలయ వ్యవస్థ ద్వారా 2.4 లక్షల మందికి ఉద్యోగాలనుఇవ్వాల్సి వచ్చిందని వివరించారు. ప్రొ ఫెసర్ ప్రసన్న కుమార్, వి.బాల మోహనదాస్, కార్తీక్, సుధాకర్ పాల్గొన్నారు.

'మహాప్రస్థానం' జీవితాన్ని మార్చింది..

» సినీ గీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ



అశోక్ తేజ దంపతులను సన్మానిస్తున్న రసజ్ఞ వేదిక ప్రతినిధులు

సీతంపేట, మార్చి 3: నాలుగు ఏళ్ల వయసులో నా తండ్రి శ్రీశ్రీ రాసిన మహా ప్రస్థానం గీతాలను చదివించడం ద్వారా ఈ రోజు మీ ముందు ఇలా నిల్చోగలుగుతున్నట్టు సినీ గీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన 40 ఏళ్ల ప్రజా గీతాల పరివ్రాజకుడు, 30 ఏళ్ల సినీ గీతాల ప్రయాణికుడు, భాషారత్న డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట-పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ తేజ మాట్లాడుతూ, విశాఖ తనకు ఎంతో ఇష్టమైన నగరమని, తన భవిష్యత్తు పునాది ఈ నగరంలోనే జరిగిందన్నారు. 1989లో బతుకు పాటలు రాసిన తర్వాత సినిమాల్లోకి అవకాశాలు వచ్చాయని తెలిపారు. రచనా వ్యాసంగాన్ని జీవితం చివరి వరకు కొనసాగిస్తానన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కిరణ్ ప్రభ కౌముది (యూఎస్ఏ) మాట్లాడుతూ సుద్దాల అశోక్ తేజ గొప్ప రచయిత, గాయకుడని అన్నారు. ఎన్నో వేల పాటలతో జనాలను రంజింప చేశారన్నారు. ఈసందర్భంగా సుద్దాల అశోక్ తేజ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రయోగ సుబ్రహ్మణ్యం, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ నరసింగరావు, పలువురు రచయితలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సముద్ర లక్ష్మణ విన్యాసాలు

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భారత్, మలేషియా ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా గత నెల 28 నుంచి ఈ నెల రెండో తేదీ రాత్రి వరకు సాగిన సముద్ర లక్ష్మణ విన్యాసాలు ముగిశాయి. ఈ విన్యాసాల్లో భాగంగా భారత్ నావికా దళానికి చెందిన కిల్తాన్, రాయల్ మలేషియాకు చెందిన కేడీ లెకిర్ పాల్గొన్నాయి. ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా హార్బర్, సీ ఫేజ్‌లో ఈ విన్యాసాలను నిర్వహిం చారు. హార్బర్ ఫేజ్‌లో భాగంగా నిర్వహించిన విన్యాసాల్లో నేవీ అధికారులతో చర్చ గోష్ఠి, పరస్పర సహకారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు నిర్వహించారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న పోర్టు అథారిటీ కమాండెంట్

విశాఖపట్నం, మార్చి 3: కైలాసపురంలోని సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది. విశాఖ పోర్టు అథారిటీ కమాండెంట్ సతీష్‌కుమార్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించడంతో తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోర్టు హాస్పటల్ సీఎంవో డాక్టర్ ఎస్.ఉషాదేవి, అసిస్టెంట్ కమాండెంట్ ఎం ఎంఏ నంద, ఇన్‌స్పెక్టర్ జీఏ.స్వామి, జి.కిరణ్‌కుమార్, ఐ.ఎక్కా, పోర్టు చీఫ్ హెల్త్ ఇనస్పెక్టర్ పి.శ్యామ్ పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 54 వ వార్డు పరిధి ఐటీఐ జంక్షన్ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు వైసీపీ నేత కేకే రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోలియో చుక్కలను వేశారు. వైద్య సిబ్బంది, స్థానికులున్నారు.

అక్కయ్యపాలెం: ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు అన్నారు. ఎనభై అడగుల రోడ్డులోని మున్సిపల్ వార్డు కార్యాలయంలో ఆదివారం పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైసీపీ యువనాయకుడు బాణాల తరుణ్‌కుమార్, గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. 45వ వార్డు సత్యసాయి నగర్‌లో దుర్గాదేవి ఆలయం వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

జ్ఞానాపురం: పోలియో రహిత సమాజంనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్లపూర్ణిమ అన్నారు. జ్ఞానాపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పీవీ తెలుగు జాతి ముద్దుబిడ్డ

» 'పీవీపై నాలుగు మంచిమాటలు' సభలో వక్తలు



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

జగదాంబ కూడలి, మార్చి 3: మాజీ ప్రధాని, భారత రత్న దివంగత నేత పి.వి. నరసింహారావు తెలుగు జాతి ముద్దు బిడ్డ అని మేధావులు, ప్రముఖులు కొనియాడారు. వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ పి.వి.నారాయణరావు అధ్యక్షతన ఆదివారం నగరంలోని దసపల్లా హోటల్‌లో పీవీ గురించి నాలుగు మంచిమాటలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సభలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు మాట్లాడుతూ, 1991 దేశంలో సంక్షోభంలో ఉన్న సమయంలో ప్రధాని పదవి చేపట్టిన పి.వి. నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశాన్ని ఒడ్డుకు చేర్చారన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పీవీ భారతదేశం ఆరాధ్యుడిగా అభివర్ణించారు. దళితుల కోసం సొంతభూమి 800 ఎకరాలను అందించి భూసంస్కరణలకు నాంది పలికారని పేర్కొన్నారు. పీవీ మనమడు ఎస్.వి.సుభాష్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలను రాజకీయాల్లో పీవీ ప్రోత్సహించారని అన్నారు. పీవీ సాహితీవేత్త, మేధావి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. వైజాగ్ బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ పి.వి నారాయణరావు, ప్రముఖులు గిడుగు రుద్రరాజు, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌డాక్టర్ వాణి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, సొసైటీ సభ్యులు ఎన్వీ సుభాష్‌న్యాయవాది నరసింహమూర్తి, హనుమంతరావు, నందూరి సుబ్ర హ్మణ్యం, అరుణ్‌కుమార్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

హిందీని యూఎన్ఓ అధికార భాషగా ప్రకటించాలి

సిరిపురం: హిందీ భాషను ఐక్యరాజ్య సమితి అధికార భాషగా ప్రకటించాలని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన ఏయూలో విలేకరులతో మాట్లాడారు. హిందీ ద్వారా విదేశాల్లో భారతీయ సంస్కృతిని వ్యాప్తి చేసేందుకు మోదీ కృషి చేస్తుండడం అద్భుతమన్నారు. అందులో భాగంగానే తనను విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడిగా చేశారని చెప్పారు.

ముగిసిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష పోటీలు



సర్టిఫికెట్లు అందిస్తున్న బీజేపీ నేత నరసింగరావు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 3: వాడోక్కై కరాటే అసోసియేషన్ నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష పోటీలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఇండోర్ హా ల్లో జరిగిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభను ప్రదర్శించి వివిధ కేటగిరిలలో ఉత్తీర్ణత సాధించారు. చిగురుపల్లి సతీష్‌కుమార్ చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరించిన పోటీల ముగింపు కార్యక్రమానికి జనసేన నేత డాక్టర్ బొడ్డేపల్లి రఘు, బీజేపీ నేత కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిధులుగా హాజరై విజేతలకు ధ్రువపత్రాలు, బెల్ట్‌లు అందించారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఝాన్సీ



కరపత్రాలు అందిస్తున్న బొత్స ఝాన్సీ

అక్కయ్యపాలెం, మార్చి 3 : విశాఖ పార్లమెంట్ వైసీపీఅభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు ఆదివా రం సాయంత్రం 46వ వార్డు కస్తూరినగర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కస్తూరినగర్, శాతిపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా కలేనా? ; కాంగ్రెస్



ఓబీసీ నేత వెంకటరావు

మురళీనగర్, మార్చి 3; ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా హామీ అమలులో కేంద్ర ప్రభు త్వం నిర్లక్ష్యం వహించడం తగదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రా ష్ట్ర చైర్మన్ మూల.వెంకటరావు అన్నారు. రాష్ట్రానికి పదేళ్లపాటుప్రత్యేక హోదా అవసరమని మోదీ, వెంకయ్యనాయుడు పట్టుబట్టి అధికారంలోకి వచ్చారన్నారు. వెనుకబాటుకు లోనైన ఉత్తరాంధ్ర, రాయలసీమ లు ప్రత్యేక హోదా వల్ల కేంద్ర ప్రభుత్వ రాయితీలతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

... 5వ పేజీ తరువాయి

నేతలు శ్రీభరత్, బొండా జగన్ పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన నిరసనలకు పార్టీ ఆదినుంచీ అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మించిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉక్కు పరిరక్షణకు వైసీపీ కట్టుబడి ఉందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జనసేన నాయకులు కోనతాతారావు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దీక్షలకు సంఘీభావం తెలిపారన్నారు. ఉక్కు పరిరక్షణకు జనసేన అండగా ఉంటుందన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు జేవీ సత్యనారాయణమూర్తి, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్‌లు మాట్లాడుతూ ఉక్కును ముంచేలా కేంద్రం విధానాలు ఉన్నాయన్నారు. బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలు పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపాయన్నారు. ప్రభుత్వరంగాలను తాబేదార్లకు అప్పగించాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా అప్పుల ఊబిలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేటీకరణకు పూనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు.

యాత్రకు భారీ స్పందన

ఉక్కు కార్మికులు నిర్వహించిన మహా పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నగరవాసులు కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏసీపీలు త్రినాథ్, రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో దువ్వాడ, స్టీలుప్లాంట్, పెదగంట్యాడ స్టేషన్లకు చెందిన పోలీసులు ఉక్కు కార్మికులతో పాటు తరలివెళ్లారు. పాదయాత్రలో జనసేన నాయకులు కోన తాతారావు, వామపక్ష నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, జెర్రిపోతుల ముత్యాలు, నీరుకొండ రామచంద్రరావు, అడుసుమిల్లి దీప్తి, గంధం వెంకటరావు, సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, మస్తానప్ప, విళ్ల రామ్మోహన్ కుమార్, నమ్మి సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, పులి వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంపై ఎందుకంత ప్రేమ?

... 5వ పేజీ తరువాయి

వామపక్షాలు చేపట్టిన మహా పాదయాత్రలో పాల్గొని, ప్లకార్డు పట్టుకుని కొంత దూరం నడిచి ఉద్యమానికి మద్దతు ప్రకటించడం ఆశ్చర్యానికి గురిచేసింది.

గాజువాక టికెట్‌పై ఆశతోనే...

గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేదిలేదని అధిష్ఠానం స్పష్టం చేయడంతోపాటు సమన్వయకర్తగా కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును నియమించింది. చందు అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాగిరెడ్డి తనకు టికెట్ ఇవ్వకపోయినా చందుకు మాత్రం ఇవ్వొద్దని అధిష్ఠానానికి షరతు విధించినట్టు సమాచారం. దీంతో యాదవ సామాజికవర్గానికే గాజువాక టికెట్ కేటాయించాలనే ఆలోచనలో వైసీపీ పెద్దలు ఉండడంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేరును నాగిరెడ్డి ప్రతిపాదించినట్టు ప్రచారం జరుగుతోంది. అందులోభాగంగానే మేయర్ హరివెంకటకుమారిని ప్రతిరోజూ గాజువాక నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు నాగిరెడ్డి ఆహ్వానిస్తున్నారని వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. గాజువాక నుంచి పోటీకి గ్రీన్‌సిగ్నల్ లభిస్తుందనే ఆశతోనే మేయర్ గాజువాకపై ప్రత్యేక దృష్టిసారించారని, అందులోభాగంగానే స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో మొదటిసారి ప్రత్యక్షంగా పాల్గొన్నారని విశ్లేషిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం?

... 5వ పేజీ తరువాయి

ఎంపికచేసిన పాఠశాలలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) బృందం పరిశీలించనుంది. ఈ బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. సోమవారం నుంచి విశాఖ జిల్లాలోని పది మండలాల్లో ఒక్కో పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించనుంది. ఆయా పాఠశాలల్లో వసతులు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలను బృంద సభ్యులు తనిఖీ చేయనున్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

... 5వ పేజీ తరువాయి

పోలీస్‌స్టేషన్ నుంచి ఒక అధికారిని వెంటనే పంపించి సమస్య పరిష్కరించాలని ఆదేశిస్తున్నామన్నారు. భూ కబ్జాలపై ఎవరైనా ధైర్యంగా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని, కచ్చితంగా వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూ కబ్జాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం, నగర బహిష్కరణ శిక్ష విధించేలా శాఖా పరంగా ప్రయత్నిస్తామన్నారు. పరదేశిపాలెంలో ఆదివారం కంటైనర్‌లో తరలిస్తున్న గంజాయిని తమ సిబ్బంది పట్టుకున్నారన్నారు. పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న ఫొటోగ్రాఫర్ సాయి అదృశ్యంపై తమకు ఈనెల 29న ఫిర్యాదు అందిందని, అతడి వద్ద రూ.లక్షలు విలువ చేసే కెమెరా ఉండడంతో దాని కోసమే అతడ్ని హత్యచేసి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. ఆలమూరు వద్ద సాయి మృతదేహం లభ్యమైందని, ఈ కేసులో ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీలు మణికంఠచందోలు, సత్యనారాయణ, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌కోర్ట్ తొలగింపుపై మీనమేషాలు!

... 5వ పేజీ తరువాయి

కొనసాగింపునకు అధికారపార్టీ నేతలంతా సానుకూలంగా ఉన్నపుడు మనమెందుకు అనవసరంగా జోక్యం చేసుకోవాలనే భావనతో అధికారులు కూడా చోద్యం చూస్తున్నారు. ఇదిలావుండగా ఫుడ్‌కోర్టులోని దుకాణాల నుంచి పాలకవర్గంలోని కొందరు పెద్దలు, వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధితోపాటు అధికారులకు కూడా ప్రతిరోజూ వాటాలు అందుతున్నాయని ప్రతిపక్ష కార్పొరేటర్లు ఆరోపిస్తున్నా వారి నుంచి స్పందనలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మార్చి 3 : వరాహలక్ష్మీనృసింహస్వామికి స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి బంగరు సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేశారు. బేడా మండప ప్రదక్షిణ తరువాత భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్క బంగరు సంపెంగతో అర్చన చేశారు. మంత్రపుష్పం,కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.తరువాత అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం, గరుడ సేవ జరిపారు.

వైద్య సిబ్బందికి ఆహార పొట్లాలు

భీమునిపట్నం (రూరల్), మార్చి 3 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బందికి దివీస్ కంపెనీ ఆహార పొట్లాలు అందజేసింది. విధి నిర్వహణలో ఉన్న 455 మందికి రూ. 50 వేలు విలువైన ఆహారం పొట్లాలు, వాటర్ బాటిళ్లు, మజ్జిగ ఇచ్చారు.

నేడు వృద్ధులకు ఉపకరణాలు పంపిణీ

భీమునిపట్నం, మార్చి 3 : పట్టణంలోని గంట స్తంభం వద్ద 60 ఏళ్లు నిండిన వృద్ధులకు సోమ వారం ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్టు బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న వయోశ్రీ యోజనలో భాగంగా వీటిని ఉచితంగా అందిస్తామన్నారు. ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అర్హులైన వృద్ధులు రేషన్ కార్డు, ఆధార్ జెరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు.

జూపార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, మార్చి 3 : నగరంలోని జూపార్కు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. సుమారు 2015 మంది పర్యాటకులు జూను సందర్శించారు. వారి నుంచి రూ. 2.34 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారీయా తెలిపారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సింహాచలం, మార్చి 3 : జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సం క్షేమ శాఖకు చెందిన గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి సింహాచలం బాలుర పాఠశాలలో 160, పెదనరవ బాలుర పాఠశాలలో 80, అన్న వరం అమృతాపురంలోని బాలికల పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలు కోరే విద్యార్థులు 3, 4 తరగతులు ఇదే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉండాలన్నారు. తల్లిదండ్రుల వా ర్షిక ఆదాయం రూ. లక్షలోపు ఉండాలని, బీసీ, ఈబీసీ విద్యార్థులు 1 సెప్టెంబరు 2013 నుంచి 31 ఆగస్టు 2015 లోపు జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రెండేళ్ల సడలింపు వర్తిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, రూ.100 ఫీజు చెల్లించి ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి ఏప్రిల్ 13న ప్రవేశపరీక్ష ఉంటుందని, రూ. 250 ఫీజు చెల్లించి ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు : ఏసీపీ

పద్మనాభం, మార్చి 3 : పద్మనాభంలో పోలీసు స్టేషన్‌లో ఆదివారం మధురవాడ జోన్ ఏసీపీ బి. సునీల్ రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వారికి ఈ కౌన్సిలింగ్ ఇచ్చారు. పద్మనాభం, భీమిలి, ఆనందపురం, పీఎం పాలెం స్టేషన్లకు చెందిన రౌడీ షీటర్లను ఆయా స్టేష్ల సిబ్బంది పద్మనాభం స్టేషన్‌కు తీసుకు రాగా వారికి ఏసీపీ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 32, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 38, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 20, క్యారెట్ 26, దొండకాయలు 26, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 110, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 24 , కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు

- బక్కన్నపాలెం ఫొటోగ్రాఫర్ సాయి పవన్ మృతదేహం లభ్యం
- గోదావరి ఇసుక తిన్నెల్లో వెలికితీత
- నిందితుడు కోనసీమ జిల్లా ఆలమూరు మండల వాసి



జొన్నాడలోని సంఘటనా స్థలం (ఇన్‌సెట్లో) నిందితుడు తేజ

కొమ్మాది, మార్చి 3 : మధురవాడలోని బక్కన్నపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం వద్ద హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలెం గ్రామానికి చెందిన పోతిన సాయి పవన్ ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఫొటో షూట్‌లు చేస్తుంటాడు. తండ్రి శ్రీను ఆటోడ్రైవర్ కాగా తల్లి రమణమ్మ కార్‌షెడ్ జంక్షన్‌లో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా పెద్దవాడు సాయి పవన్ (22) ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఫొటోషూట్ చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన షణ్ముఖ తేజ తాను కూడా ఫొటో షూట్ చేస్తుంటానని, ఫోన్ ద్వారా సాయిని పరిచయం చేసుకున్నాడు. షణ్ముఖ తేజ, సాయి వద్ద రూ. 15 లక్షల విలువైన హైటెక్నాలజీ కెమెరాలు ఉన్నట్టు తెలుసుకున్నాడు.వాటిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సాయికి ఫోన్ చేసి రావులపాలెంలో పెద్ద ఈవెంట్ ఉందని, నీ దగ్గర ఉన్న కెమెరాలతో ఇద్దరం కలిసి ఈవెంట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని నమ్మబలికాడు. దీంతో సాయి గతనెల 26న విశాఖ నుంచి రైలులో బయల్దేరి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి షణ్ముఖ తేజ కారును అద్దెకు తీసుకొచ్చి దారి మధ్యలో హత్య చేసి జొన్నాడ వద్ద గోదావరి ఇసుక తిన్నెల్లో పాతి పెట్టారు. రూ.15 లక్షల విలువ చేసే కెమెరాలు, ఇతర సామగ్రిని పట్టుకుని పారిపోయారు. అయితే ముందుగా తనకు ఏదో ఆపద జరుగుతుందని గమనించిన సాయి కారు నెంబరును తన తల్లికి వాట్సాప్ చేశారు. తన నెంబరు పని చేయకపోతే వేరే నెంబరుకు ఫోన్ చేయమని తేజ నెంబరు పంపించాడు. తన కుమారుడు ఆపదలో ఉన్నాడనే విషయాన్ని తల్లి తెలుసుకోలేకపోయింది. ప్రతి రోజూ మాట్లాడేవాడు రెండు రోజులుగా ఫోను చేయలేదని అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సమాచారంతో గతనెల 29న పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయి పంపించిన కారు నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడు రావులపాలెంకు చెందిన షణ్ముఖ తేజగా గుర్తించారు. సాయి కుంటుబ సభ్యులు పీఎంపాలెం సీఐ రామకృష్ణ సూచన మేరకు రావులపాలెం వెళ్లగా అప్పటికే షణ్ముఖ పరారీలో ఉన్నాడు. అతని తల్లిదండ్రులను పోలీసులు విచారించగా సాయిని హత్య చేసి, కెమెరాలను పైన గదిలో పెట్టినట్టు చెప్పడంతో పోలీసులు గది తాళాలు పగలకొట్టి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కెమెరాలను షణ్ముఖ తండ్రిని పీఎంపాలెం స్టేషన్‌కు తీసుకువచ్చారు.

అమ్మాయితో చాటింగ్ చేయించి, పట్టుకున్నారు

నిందితుడు షణ్ముఖ తేజ మొదటి నంబరు స్విచ్ఛాఫ్‌లో ఉండగా రెండవ నంబరును పోలీసులు ట్రేస్ చేసి అన్నవరంలో ఉన్నట్టు గుర్తించారు. అక్కడికి వెళ్లేసరికి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం షణ్ముఖ తేజకు నగరంలోని కంచరపాలెంకు చెందిన అమ్మాయికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఉన్నట్టు గుర్తించి ఆ అమ్మాయిని, ఆమె తల్లిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు.ఆమెతో షణ్ముఖకు ఫోన్‌లో చాటింగ్ చేయించారు. ఈమె మెసేజ్‌కు షణ్ముఖ స్పందించడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం షణ్ముఖ ఇచ్చిన సమాచారం మేరకు సాయిని చంపి పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులు గుర్తించారు. అనంతరం పవన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే ఈ కేసులో కేవలం కెమెరాల కోసమే షణ్ముఖ ఇంతకు తెగించాడా లేదా మరో కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబ సభ్యుల రోదన

వారం రోజుల క్రితం అదృశ్యమైన కుమారుడు సాయి మృతదేహం చూసి తల్లిదండ్రులు శ్రీను, రమణమ్మ బోరున విలపించారు. తమతో ఎంతో సరదాగా ఉండే సాయిని దారుణంగా చంపేశారంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కాగా ఈ కేసులో కారు డ్రైవర్ వినోద్ పాత్ర కూడా ఉన్నట్టు తెలుస్తోంది.

వాడవాడలా పల్స్ పోలియో



ఆరిలోవ : చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

భీమునిపట్నం, మార్చి 3 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. పట్టణంలోని 3వ వార్డు నూకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో వార్డు కార్పొరేటర్ అప్పలకొండ, 4వ వార్డులో పెద ఉప్పాడ హెల్త్ సబ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో కార్పొరేటర్ ఏడుకొండలరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 3వ వార్డులో ఐదేళ్లలోపు పిల్లలు 1350 మంది ఉండగా 96 శాతం పోలియో చుక్కలు వేశామని తోటవీధి యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. 4వ వార్డులో 1430 మంది చిన్నారులు వుండగా 98 శాతం మందికి పోలియో చుక్కలు వేశామని మెడికల్ ఆఫీసరు డా. ప్రవంతి తెలిపారు.

వెంకోజీపాలెం : ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అనీషా పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కేఆర్ఎం కాలనీలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద కమిషనర్ సాయికాంత్ వర్మ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తగరపువలస పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన పల్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. తగరపువలస పరిధిలోని 28 కేంద్రాల్లో 56 మంది సిబ్బందితో 2,598 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

ఆరిలోవ : ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆరిలోవ రిఫరల్ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఎండాడ : జీవీఎంసీ 8, 9 వార్డుల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. ఎండాడలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) డాక్టర్ లక్ష్మీ సంధ్య ఆధ్వర్యంలో 8వ వార్డులో 12 ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి 1401 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.అలానే 9వ వార్డులోనూ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పర్యాటక ప్రాంతాలైన తెన్నేటి పార్కు, కైలాసగిరి, రుషికొండ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

ఆనందపురం : మండలంలోని 26 పంచాయతీల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. లక్ష్యానికి మించి పోలియో చుక్కలు వేసినట్టు ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. ఆనందపురంలో సర్పంచ్ చందక లక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వేములవలస, గండిగుండం, రామవరం, శొంఠ్యాం, తర్లువాడ, గిడిజాల పంచాయతీల్లోనూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా జరి పారు.

పద్మనాభం : మండలంలో 43 కేంద్రాల ద్వారా చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. మద్దిలో ఎంపీపీ రాంబాబు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు.శేరిఖండం, రెడ్డిపల్లి కేంద్రాల్లో పోలియో చుక్కల కొరత ఏర్పడడంతో కొంత సమయం చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. వైద్యాధికారులు వెంటనే వేరే కేంద్రం నుంచి అక్కడికి వ్యాక్సిన్లను పంపించారు. 3229 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 3010 మందికి చుక్కలు వేశారు. ప్రయాణాల్లో ఉన్న 56 మంది పిల్లలతో పాటు ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలు 92 మందికి కూడా పోలియో చుక్కలు వేశారు.

సింహాచలం : సింహాచలంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్ర పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కలు శత శాతం వేసినట్టు వైద్యాధికారి డా. ప్రసాద్ నాయక్ తెలిపారు. పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆసుపత్రి వైద్యుడు బి. అప్పలనాయుడు ప్రారంభించారు.ఆసుపత్రి పరిధిలో 9 సచివాలయాలు, 14 ప్రత్యేక బూత్‌ల ద్వారా 2549 మంది చిన్నారులకు చుక్కల మందు వేశారు. సింహగిరిపై, కొండదిగువ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రత్యేక శిబిరాల ద్వారా 575 మంది చిన్నారుకు పోలియో చుక్కలు వేశారు.

కొమ్మాది : చిన్నారులకు క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డులోని యూపీహెచ్‌సీలో చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేసారు.

నేడు కృష్ణ కళాశాలలో జాబ్‌మేళా

మద్దిలపాలెం, మార్చి 3 : డిగ్రీ పాసైన వారికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో డిగ్రీ కళాశాలల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని కళాశాల విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగే జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌మేళాలో పాల్గొనే వారు ఉదయం 9 నుంచి కళాశాలలో తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. చాలా కంపెనీలు మేళాకు వస్తున్నాయని, డిగ్రీ పూర్తయిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆరో వార్డులో పార్కు ప్రారంభం

కొమ్మాది, మార్చి 3 : జీవీఎంసీ ఆరో వార్డు ఎంఎస్ఆర్ లేఅవుట్‌లో రూ. 1.70 కోట్లతో ఏర్పాటు చేసిన పార్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ లక్ష్మి, కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు

భీమునిపట్నం (రూరల్), మార్చి 3 : నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించే వారికే మద్దతు ఇస్తామని అన్ని రాజకీయ పార్టీల నేతలు తీర్మానించారు. ఆదివారం రాత్రి వారు అవంతి కాలేజీ సమీపంలో జాతీయ రహదారి పక్కనున్న ఎంఆర్ ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తగరపువలస ఆర్టీసీ కాంప్లెక్సు నిర్మాణం, జూట్‌మిల్లు కార్మికుల సమస్య, రహదారులు, పరిశ్రమల ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు పల్ల వెంకటరావు, పిట్ట సురేష్, గంటా నూకరాజు, బడిగంటి నీలకంఠం పూసర్ల రామారావు, గిడుతూరి శ్రీను, గాదం మహేష్, పడాల రమణ, కదిరి జగన్నాథం, రామకృష్ణ, కానూరి రాంబాబు, మొర అప్పలరాజు, పల్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు గుళ్లపల్లికి పురస్కారం



ఆరిలోవ, మార్చి 3 : ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపకుడు డాక్టర్ గుళ్లపల్లి ఎన్. రావుకు వరల్డ్ ఐకాన్ - 21 పురస్కారం లభించింది. ఈమేరకు హనుమంతవాక జంక్షన్‌లో ఉన్న ఆ వైద్య శాల సిబ్బంది శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఇండోనేషియాలోని బాలి నగరంలో జరిగిన 39వ ఆసియా పసిఫిక్ అకాడమీ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రతిభావంతులైన 23 మంది నేత్ర వైద్య నిపుణులకు పురస్కారాలు ఇచ్చి సత్కరించారన్నారు. అందులో గుళ్లపల్లి కూడా ఉన్నారని చెప్పారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి

ప్రత్యేక శిబిరాల్లో టీడీపీ నాయకులు



చైతన్య నగర్‌లో ఏర్పాటు ఓటరు నమోదు శిబిరం

వెంకోజీపాలెం, మార్చి 3 : వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి ఆధ్వర్యంలో కేఆర్ఎం కాలనీలో ఆదివారం ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఓటుహక్కు లేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మొల్లి శోభ, ముగడ వాసు, తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, జి. అప్పన్న, మొల్లి శంకర్, బంగార్రాజు, రామస్వామి పాల్గొన్నారు. 15వ వార్డులోని ఎంఎంటీసీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన కూడా ఓటరు నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, నాయ కులు సీహెచ్ గోవింద్, కె.మహేష్, నూకరాజు, బోను శ్రీను, కర్రి గౌరీ, సోని, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

23వ వార్డులో...

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు చైతన్య నగర్‌లో వార్డు అధ్యక్షుడు గొలగాని పురుషోత్తం ఆధ్వర్యంలోనూ ఓటరు నమోదు చేపట్టారు. వార్డులో 18 ఏళ్లు నిండిన వారితో ఓటరు నమోదుకు దరఖాస్తు చేయించారు. కార్యక్రమంలో బూస రాంబాబు, బూస పోతన్నరెడ్డి,గుడ్ల గోవింద్‌రెడ్డి, తెంటు స్వామినాయుడు, బీఎస్ఎన్ రెడ్డి, పూతి వరప్రసాద్ పాల్గొన్నారు.

విశాలాక్షినగర్‌లో ...

విశాలాక్షినగర్ : విశాలాక్షినగర్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రాంతంలో 9వ వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో ఓటరు నమోదు చేపట్టారు. శిబిరంలో ఓటరు వెరిఫికేషన్, నమోదు, ఓటరు షిఫ్టింగ్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, రాజా, శివ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో...

రామ్‌నగర్ : రామ్‌నగర్‌లోని బజారు జంక్షన్‌లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఓటరు నమోదు శిబిరం ఏర్పాటు చేశారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ కమిటీ అధికార ప్రతినిధి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సారిపల్లి మహేష్, ఉరుకూటి పైడిరాజు, జోగా సూర్యారావు, రేగాని అప్పారావు, తోటపల్లి ప్రకాష్, అనిల్, తలారి శ్రీను పాల్గొన్నారు.

ఆరిలోవ : అర్హులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద అన్నారు. హనుమంతువాక జంక్షన్‌లో టీడీపీ నాయకులు ఓటరు నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒమ్మి పోలారావు, బాదరు బాలరాజు, ఫకీర్, రాంబాబు పాల్గొన్నారు. 13వ వార్డులోని చినగదిలి లలితాంబ గుడి వద్ద కూడా ఓటరు నమోదు చేపట్టారు.

49 కేసుల్లో రూ.1,51 కోట్ల విలువైన సొత్తు రికవరీ



రికవరీ సొత్తును పరిశీలిస్తున్న సీపీ రవి శంకర్

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి భారీగా సొత్తు రికవరీ చేసినట్టు సీపీ రవి శంకర్ అయ్యన్నార్, జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప తెలిపారు. నిందితుల నుంచి రికవరీ చేసిన సొత్తుని చట్టపరంగా బాధితులకు అందజేసే క్రమంలో 'రికవరీ మేళా' పేరుతో ఆదివారం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది ఫిబ్రవరి నెలలో 86 దొంగతనాలు జరిగాయన్నారు. ఈ చోరీల్లో దాదాపు రూ.1.51 కోట్ల విలువైన సొత్తుని నిందితులు అపహరించుకుపోయారన్నారు. 86 కేసుల్లో 49 కేసులను చేదించడంతో పాటు చోరీలకు పాల్పడిన 60 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. నిందితుల నుంచి రూ.1,00,42,051 విలువ చేసే సొత్తును రికవరీ చేశామన్నారు. అలాగే గత నెల 7న రాత్రి పది గంటల నుంచి నాకాబందీ పేరుతో నగరమంతా ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా భారీగా గంజాయి, మద్యం, నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దీంతో పాటు రూ. 9 కోట్ల విలువ చేసే 14.47 కిలోల బంగారం, 13.31 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు. నగరంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి నుంచి 'చాట్‌బాట్' పేరుతో ఫిర్యాదులు స్వీకరించామని, గత నెలలో పోయిన సెల్‌ఫోన్లలో 376 ఫోన్లను రికవరీ చేశామని, వాటిని బాధితులకు అందజేస్తామన్నారు. వీటి విలువ రూ. 56 లక్షలు ఉంటుందని చెప్పారు. చాట్‌బాట్ ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ 1155 సెల్ ఫోన్లు రికవరీ చేశామని వీటి విలువ రూ.1.73 కోట్లు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డీసీపీలు మణికంఠ చందోలు, సత్యనారాయణ, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, క్రైమ్ ఏసీపీ వెంకటరావు, సీఐలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కళాభారతి రోడ్డులో ధర్నా చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

కార్పొరేటర్ తీరుకు నిరసనగా ధర్నా

మద్దిలపాలెం, మార్చి 3 : జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తీరుకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు కళాభారతి రోడ్డులో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మణి మాట్లాడుతూ కళాభారతి రోడ్డులో సంత, తోపుడు బండ్ల వ్యాపారాల ద్వారా 20 ఏళ్లగా 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయన్నారు. వారిని అక్కడి నుంచి తరలించేందుకు కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చిరు వ్యాపారాలు ఎక్కడైతే వ్యాపారం చేసుకుంటారో అక్కడే వారికి ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కృష్ణారావు, అనపర్తి అప్పారావు, పి. వెంకటరావు, సింహాచలం, కె. కుమారి, బన్నీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో కార్యకలాపాలు ప్రారంభించాలి

తగరపువలస, మార్చి 3 : తగరపువలసలోని రైతుబజారులో వెంటనే కార్యకలాపాలను ప్రారంభించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జీఆర్ భవన్‌లో తగరపువలస, చిట్టివలస సీపీఐ శాఖల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు మోర అప్పలరాజు మాట్లాడుతూ ఎంతో కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న రైతుబజారును ఎట్టకేలకు ప్రారంభించినా.. ఇంతవరకు క్రయ, విక్రయాలు జరగలేదని, రైతులకు దుకాణాలను కేటాయించలేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రైతు బజారులో కార్యకలాపాలను ప్రారంభించాలని కోరారు.

గిరిజన్ భవన్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన

ఎంవీపీ కాలనీ, మార్చి 3 : చేనేత, హస్తకళ కళాకారులను ప్రోత్సహించాలని హ్యాండి క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు కోరారు. ఆదివారం వారు ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22 వరకూ గిరిజన్ భవన్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన ఉంటుందన్నారు. కళాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు.

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, మార్చి 3 : కృష్ణాపురంలోని నృసింహవనంలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, సూర్య నమస్కారాలు చేశారు. కొందరు ఆలయ ఆవరణలో దీపారాధన చేసి చిక్కుడు కాయల రథాలపై పాయసాన్ని వండి నివేదించారు. కాగా భక్తులు అధికంగా వస్తున్నప్పటికీ దేవస్థానం ఇక్కడ ఒక అర్చకుడ్ని కూడా ఏర్పాటు చేయకపోగా కనీసం తాగునీరు, వసతి సౌకర్యాలు కూడా కల్పించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాత అడివివరంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

సింహచలం, మార్చి 3 : వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం పిలుపునిచ్చారు. పాత అడివివరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు రాజనాల సత్యారావు, పట్నాల ధర్మరాజు, సిరిపురపు సురేష్, లండ శ్రీనివాస్, రౌతు రాంబాబు, గుసిడి అవినాష్ బాబు, బంటుబిల్లి రవికిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా మాన్సాస్ వ్యవస్థాపక దినోత్సవం

భీమునిపట్నం, మార్చి 3 : పట్టణంలో ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో మాన్సాస్ ట్రస్టు 67వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు పాత బస్టాండ్‌లో వున్న పీవీజీ రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువు కోసం పీవిజి రాజు తన తండ్రి పేరిట మహారాజా అలక్ నారాయణ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ సంస్థను స్థాపించారన్నారు. సంస్థ నిర్వహణకు 13 వేల ఎకరాలను ధారాదత్తం చేసిన గొప్ప వ్యక్తి పీవిజి రాజు అని కొనియాడారు.

త్వరలో విజ్జిస్ ఎంపీఎల్ సీజన్ 2 క్రికెట్ పోటీలు



క్రికెట్ టీమ్ ఆక్షన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజయమోహన్

సాగర్‌నగర్, మార్చి 3 : విశాఖ వేదికగా త్వరలోనే విజ్జిస్ ఎంపీఎల్ సీజన్ 2 క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు విజ్జిస్ ఫౌండేషన్ చైర్మన్ తలశిల విజయమోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి రాడిసన్ బ్లూ హోటల్‌లో విజ్జిస్ ఎంపీఎల్ 2 క్రికెట్ టీమ్ ఆక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీమ్ ఆక్షన్‌లో 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతి ఫ్రాంఛైజీ టీమ్ నుంచి 15 మంది క్రీడాకారులు ఉండేలా ఎంపిక చేస్తామని చెప్పారు. యువతకు క్రీడలపై ఆసక్తి కల్పించడానికి, వారిలో పోటీతత్వాన్ని నింపేందుకు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే వేదికతో పాటు ఫ్రాంఛైజీ టీమ్‌లను, తేదీలను ఖరారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శివ, స్వరూప్, సహకారం శ్రీను, ఆర్గనైజర్ బైలిప్లి ప్రసాద్, వాండ్రాసి రవి, జగ్గుపిల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

సాగర్‌నగర్, మార్చి 3 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం నగరానికి రానుండడంతో బీచ్ రోడ్డులో నగర సుందరీకరణ, పరిశుభ్రత పనులు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి రుషికొండ ఐటీ సెజ్ హిల్‌నెంబర్ 3 వద్ద హెలిప్యాడ్ ప్రదేశం, రాడిసన్ బ్లూ హోటల్‌లో వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద చేపట్టవలసిన ఏర్పాట్లు గురించి అధికారులకు సూచనలు ఇచ్చారు. బీచ్ రోడ్డులో రోడ్లను పరిశీలిస్తూ పరిశుభ్రత, సెంటర్ మీడియన్ లైటింగ్, గ్రీనరీ తదితర పనుల్లో ఆటంకాలు లేకుండా చర్యలు చేపడుతూ నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

పద్మనాభం, మార్చి 3 : పద్మనాభంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో శిథిల గృహం దగ్ధమయ్యింది. సమీపంలో ఉన్న వారు చెత్త కాల్చడంతో నిప్పు రవ్వ వెళ్లి ఆ ఇంటిపై పడడంతో మంటలు వ్యాపించాయి. సమీపంలో ఉన్న ఇళ్లు, షాపుల మీదకు కూడా మంటలు వ్యాపించడంతో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీను, స్థానికులు మోటారు సైపు నీరుతో వాటిని అదుపు చేశారు. పద్మనాభం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

శ్రీ ఎంబర్‌మన్నార్ స్వామి దేవస్థానం
దేవాదాయ ధర్మాదాయశాఖ, కంచరవీధి, విశాఖపట్నం

టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన

విశాఖపట్నం జిల్లా మరియు నగరంలోని కంచరవీధిలో వేంచేసియున్న శ్రీ ఎంబర్‌మన్నార్ స్వామి దేవస్థానమునకు సంబంధించిన హక్కుభుక్తంలో గల షాపు ఈ దిగువ సుదహరించిన ప్రకారం తేది.14-03-2024 గురువారం ఉదయం 11.00 గం.లకు టెండరు కమ్ బహిరంగ వేలం పాట దేవాదాయశాఖ అధికారుల సమక్షమున శ్రీ ఎంబర్‌మన్నార్ స్వామి దేవస్థానం, కంచరవీధి, విశాఖపట్నం ఆలయ ప్రాంగణంలో జరుగును.

వ.నెం.	వివరములు	ప్రథమ ధరావత్తు	కాల పరిమితి
1.	డోరు నెం.22-65-1 దావలివారి వీధి, విశాఖపట్నం	రూ.50,000/-	01-04-2024 నుండి 31-03-2027 వరకు

* టెండరు దాఖలు చేయువారు దేవస్థానం కార్యాలయము నందు తేది.04-03-2024 నుండి 13-03-2024 వరకు మాత్రమే టెండరు షెడ్యూల్ పొందవచ్చును. పూర్తిచేసిన టెండర్లు దేవస్థానము వారు ఏర్పాటు చేసిన బాక్స్ నందు తేది.14-03-2024న బహిరంగ వేలము పాటకు ముందు ఉదయం 10 గం.ల లోపు వేయవలెను. షెడ్యూలు ఖరీదు రూ.200/-.
* ఈ బహిరంగ వేలములో పాల్గొనదలచినవారు ముందుగా ప్రథమ ధరావత్తు శ్రీ ఎంబర్‌మన్నార్ స్వామి దేవస్థానం పేరుపై డి.డి. మాత్రమే తీసి పాటలో పాల్గొనవలెను, హెచ్చు పాటదారు 12 నెలలు అద్దె సొమ్ము చెల్లించి రశీదు పొందవలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం. 9618325818.

విశాఖపట్నం
తేది.03-03-2024

ఇట్లు
ఎం.నీలిమ, M.Sc.
కార్యనిర్వహణాధికారిణి.